# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 182 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజీలు : 8 | వెల రూ. 2 | శనివారం -03 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana


## ఫ్లైదుబాయ్ ఘటన.. పైలట్ స్మిత్ మచ్చర్ యూఏఈకి ఎయిర్‌లిఫ్ట్



కో-పైలట్ దాడి ఘటనలో గాయపడిన స్మిత్ మచ్చర్

చికిత్స కోసం యూఏఈకి తరలింపు

స్మిత్ మచ్చర్ ఆరోగ్యం నిలకడగా ఉందన్న భారత రాయబార కార్యాలయం

హైదరాబాద్ : ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో జరిగిన దాడిలో గాయపడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం యూఏఈకు ఎయిర్‌లిఫ్ట్ చేశారు. దుబాయ్-ఇజ్రాయెల్ విమానంలో కో-పైలట్ దాడికి దిగిన అనంతరం, ఆ విమానం సౌదీ అరేబియాలో సురక్షితంగా ల్యాండ్ అయిన విషయం విదితమే. విమానం ల్యాండ్ అయిన వెంటనే కెప్టెన్ మచ్చర్‌ను అక్కడి సైనిక ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయనను తదుపరి వైద్యం కోసం యూఏఈకి తరలించగా, స్మిత్ మచ్చర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. మిగతా..2లో

## రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ

కరవు పరిస్థితులపై చేపట్టాల్సిన చర్యలపై

కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించాలని తెలంగాణ

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన

హైదరాబాదర్: రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న కేబినెట్ భేటీలో సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. తీవ్ర వర్షాభావం వల్ల దాదాపు 235 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించాలని నిర్ణయం తీసుకున్నారు. మిగతా..2లో

## రెండేళ్లలో అధికమొత్తంలో నిధులు కేటాయించాం: మంత్రి నారాయణ



2

- ఏపీలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి రెండేళ్లలో అధికమొత్తంలో నిధులు కేటాయించామని మంత్రి నారాయణ అన్నారు.
- రెండేళ్లలో అధికమొత్తంలో నిధులు కేటాయించాం: మంత్రి నారాయణ

నెల్లూరు, అక్టోబర్ 1: ఏపీలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి రెండేళ్లలో అధికమొత్తంలో నిధులు కేటాయించామని మంత్రి నారాయణ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. వైజాగ్, విజయవాడలో వేలాది మందికి శాశ్వత నివాస ధ్రువీకరణ పట్టాలు ఇచ్చామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. 'నెల్లూరులోనూ గతంలో 1450 మందికి పట్టాలిచ్చామని తెలిపారు. త్వరలో మరో 1250 మందికి పట్టాలిస్తాం. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి, ఎన్నికల్లో విజయం సాధిస్తాం. నా కుటుంబ సభ్యుల్లో కూడా ఎవరూ రాజకీయాల్లోకి రారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

# హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

- గత వైఎస్సార్సీపీ పాలనలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదిలి పారిపోయారని కూటమి ప్రభుత్వంలో వారంతా ఏపీకి క్యూ కడుతున్నారని చంద్రబాబు అన్నారు.
- బాపట్ల జిల్లా రేపల్లెలో నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.



అమరావతి : 34 శాతం బీసీ రిజర్వేషన్లను హైకోర్టు కొట్టివేయడంతో సుప్రీంకోర్టు వెళ్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలోని అర్వపల్లిలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ఈ అంశంపై స్పందించారు. ఎన్టీఆర్ కాలం నుంచి బీసీలు అండగా ఉన్నారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో తానే 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశానని చెప్పారు. ఆ తర్వాత వచ్చిన గొడ్డలిపార్టీ రిజర్వేషన్లను 24 శాతానికి మార్చిందని విమర్శించారు. దీంతో 1.68 లక్షల ఉద్యోగాలు పోయే పరిస్థితి వచ్చిందన్నారు. మళ్లీ తాము అధికారంలోకి వచ్చాక 34 శాతానికి పెంచామని తెలిపారు. కానీ గొడ్డలి పార్టీ మరోసారి కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లను అడ్డుకుందని మండిపడ్డారు.

## లోకేశ్‌పై రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశంసలు.. ఇతర నేతలు ఆదర్శంగా తీసుకోవాలని సూచన



కొచ్చిలో జరిగిన ఓ కార్యక్రమంలో లోకేశ్‌ను ఇంటర్వ్యూ చేసిన రాజ్‌దీప్

స్క్రిప్ట్ లేకుండా కఠిన ప్రశ్నలకు సూటిగా బదులిచ్చారని కొనియాడిన వైనం

చాలా స్పష్టంగా సమాధానాలు ఇచ్చారని ప్రశంస

అమరావతి : సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్.. ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్‌పై ప్రశంసలు కురిపించారు. తాను చేసిన ఇంటర్వ్యూలో లోకేశ్ వ్యవహరించిన తీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కఠినమైన ప్రశ్నలకు మిగతా..2లో

## మరో 15 రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు రాక- 'ఎల్ నినో' ఎఫెక్ట్ ఎప్పటి వరకు ఉంటుందంటే?



2

- భారత వాతావరణ శాఖ కీలక ప్రకటన
- అక్టోబరు 15 నుంచి 21 మధ్య దేశంలోకి ఈశాన్య రుతుపవనాలు వచ్చే ఛాన్స్ ఉందని వెల్లడి
- మరో కొద్ది రోజుల్లో నైరుతి రుతుపవనాలు ముగియనున్నాయన్న ఐఎండీ

ఢిల్లీ : దేశంలోకి ఈశాన్య రుతుపవనాలు అక్టోబర్ 15-అక్టోబర్ 21 మధ్య ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. అదే సమయంలో నైరుతి రుతుపవనాలు రాబోయే రెండు- మూడు రోజుల్లో ముగియనున్నాయని వెల్లడించింది. చెన్నైలోని పల్లికరణైలో

## కో-పైలట్‌కు 'తీవ్ర ఇస్లామిస్ట్ భావజాలం'.. నెతన్యాహు సంచలన ఆరోపణలు!

- భారత పైలట్ స్మిత్‌పై దాడి చేసిన కో-పైలట్ ఒమన్ జాతీయుడని ఇజ్రాయిల్ చెబుతోంది.
- భారత పైలట్‌పై దాడి చేసిన కో-పైలట్ "ఇస్లామిస్ట్ ఇండోక్ట్రినేషన్"కు గురయ్యాడని చెప్పారు.



ఢిల్లీ : ఫ్లైదుబాయ్ 1073 విమానం ఘటనలో భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడి, విమానాన్ని కూల్చే ప్రయత్నంపై ఇజ్రాయిల్ దర్యాప్తు చేస్తోంది. యూఏఈతో కలిసి దర్యాప్తులో పాలుపంచుకుంటోంది. ఈ దాడి ఘటనలో కో-పైలట్ తీవ్ర ఇస్లామిక్ భావజాలానికి ప్రభావితమై ఉన్నాడని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఆరోపించారు. ఈ ఘటన వెనక అతడికి ఎవరైనా సహకరించారా? ఇరాన్‌తో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భారత పైలట్ స్మిత్‌పై దాడి చేసిన మిగతా..2లో

## ఆసియా క్రీడల విజేతలకు ప్రధాని మోదీ ప్రశంసలు.. సెయిలింగ్, ఆర్చరీ, స్క్వాష్ మెడలిస్టులకు అభినందనలు!

- అంతర్జాతీయ వేదికపై అసాధారణ నైపుణ్యంతో దేశ ప్రతిష్టను పెంచిన అథ్లెట్ల ప్రతిభను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు.
- ప్రతికూల పరిస్థితుల్లోనూ అద్భుతమైన సంకల్పంతో పోరాడి పోడియంపై సముచిత స్థానం దక్కించుకున్నారని ప్రశంసించారు.



2

ఢిల్లీ : జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో అద్భుత ప్రదర్శన కనబరిచి సెయిలింగ్, ఆర్చరీ, స్క్వాష్ విభాగాల్లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులను ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఘనంగా అభినందించారు. అంతర్జాతీయ వేదికపై అసాధారణ నైపుణ్యంతో దేశ ప్రతిష్టను పెంచిన అథ్లెట్ల ప్రతిభను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. ఒత్తిడిని అధిగమించి కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించిన గణేష్ మణి రత్నం తిరుమూరుపై ప్రధాని ప్రశంసల జల్లు కురిపించారు.

## వచ్చే ఎన్నికల వరకు రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ కలిసి ఉంటారా?



2

- వచ్చే ఎన్నికల వరకు రేవంత్, మహేష్ కలిసి ఉంటారా అని జీవన్ రెడ్డి ప్రశ్న
- వీళ్ల జోడీ మళ్లీ అధికారంలోకి వస్తుందని గొప్పగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా
- మల్కాజ్ గిరి ఎంపీ స్థానంలో ఉన్న ఒక్క ఎమ్మెల్యే స్థానం కూడా గెలవలేదని వ్యాఖ్య

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వచ్చే ఎన్నికల వరకు రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ జోడీ ఉంటుందా? అని సూటిగా ప్రశ్నించారు. వీరి జోడీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వీళ్లు గొప్పగా చెప్పుకుంటున్నారని...

# మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

- రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్
- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు డిమాండ్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్
- తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్
- ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్





హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. మిగతా..2లో

## బీఆర్ఎస్‌తో పొత్తు, ఖైరతాబాద్‌లో బీజేపీ పోటీపై కిషన్ రెడ్డి ఏమన్నారంటే?



బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేసిన కిషన్ రెడ్డి

ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఈసీపై దాడి చేస్తోందని ఆరోపణ

హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు

కాంగ్రెస్ దొంగ ఓట్లను చేర్పించే ప్రయత్నం చేస్తోందని విమర్శ

హైదరాబాద్: ఖైరతాబాద్ లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని, అయితే ఈసారి బీజేపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులపై మిగతా..2లో

## రెండేళ్లలో అధికమొత్తంలో నిధులు కేటాయించాం: మంత్రి నారాయణ

నా కూతురు షరణి మేయర్‌గా పోటీ చేయరు. ఇవన్నీ వట్టి ఆరోపణలు. నాపై ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినా.. నేను పట్టించుకోను. పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగానే కన్పిస్తుంది. ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాను. ప్రజలకు సేవ చేస్తాను' అని మంత్రి నారాయణ అన్నారు.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?
# సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

## ఆసియా క్రీడల విజేతలకు ప్రధాని మోదీ ప్రశంసలు..
## సెయిలింగ్, ఆర్చరీ, స్క్వాష్ మెడలిస్టులకు అభినందనలు!

తీవ్రమైన పోటీలోనూ సంయమనం, అచంచలమైన పోరాట పటిమ కనబరిచి అద్భుత విజయాన్ని అందుకున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తు పోటీల్లో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మహిళల స్క్వాష్ టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలుచుకున్న అనహత్ సింగ్, జోష్నా చినప్ప, తన్వి ఖన్నా, షమీనా రియాజ్‌ల బృందాన్ని ప్రధాని మోదీ అభినందించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ అద్భుతమైన సంకల్పంతో పోరాడి పోడియంపై సముచిత స్థానం దక్కించుకున్నారని ప్రశంసించారు. భారత మహిళా స్క్వాష్ క్రీడాకారిణులు సాధించిన ఈ విజయం దేశంలో ప్రాచుర్యం పొందుతున్న స్క్వాష్ క్రీడ వైపు యువతను మరింతగా ఆకర్షించడానికి, వారిలో సరికొత్త స్ఫూర్తిని నింపడానికి ఎంతగానో దోహదపడుతుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు సెయిలింగ్ పురుషుల, మహిళల స్కిఫ్ విభాగాల్లో రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్న సెయిలర్ల కృషిని కూడా ప్రధాని కొనియాడారు. దేశానికి గౌరవం తెచ్చిన ప్రతి అథ్లెట్ శ్రమను గుర్తిస్తూ రాబోయే ఈవెంట్లలో భారత బృందం మరిన్ని పతకాలతో స్వదేశానికి తిరిగి రావాలని మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

## కో-పైలట్‌కు 'తీవ్ర ఇస్లామిస్ట్ భావజాలం'..
# నెతన్యాహు సంచలన ఆరోపణలు!

కో-పైలట్ ఒమన్ జాతీయుడని ఇజ్రాయిల్ చెబుతోంది. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నెతన్యాహూ మాట్లాడుతూ.. భారత పైలట్‌పై దాడి చేసిన కో-పైలట్ "ఇస్లామిస్ట్ ఇండోక్ట్రినేషన్"కు గురయ్యాడని చెప్పారు. తీవ్రమైన ఇస్లామిక్ భావజాలాన్ని పదే పదే బోధించి, దానితో ప్రభావితం చేశారని అన్నారు. పైలట్ స్మిత్ మచ్చర్ కో-పైలట్ దాడికి గురైనప్పటికీ, రక్తమోడుతున్నప్పటకీ కాక్‌పిట్ తలుపులు తెరిచారు. దీంతో ప్రయాణికులు కాక్‌పిట్‌లోకి చేరి, కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత సౌదీ అరేబియాలోని ఒక చిన్న ఎయిర్ పోర్టులో సుక్షితంగా విమానం ల్యాండైంది. ఈ ప్రమాదం నుంచి 180 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. గాయాలపాలైన స్మిత్ ప్రస్తుతం యూఏఈలో చికిత్స పొందుతున్నారు.

## ఫ్లైదుబాయ్ ఘటన.. పైలట్ స్మిత్ మచ్చర్ యూఏఈకి ఎయిర్‌లిఫ్ట్

కాగా, సహ పైలట్ జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ, కెప్టెన్ స్మిత్ మచ్చర్ అసాధారణ ధైర్యసాహసాలను ప్రదర్శించి 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు.

## వచ్చే ఎన్నికల వరకు రేవంత్ రెడ్డి,
# మహేశ్ గౌడ్ కలిసి ఉంటారా?

వీళ్లు ఎన్ని రోజులు కలిసుంటారో వీళ్లకే తెలియదని ఎద్దేవా చేశారు. ఈయన పీసీసీ ప్రెసిడెంట్ గా ఉంటాడో లేదో ఆయనకు తెలియదని... ఆయన సీఎంగా ఉంటాడో లేదో ఈయనకు తెలియదని అన్నారు. మీ జోడీ, మీ పేర్లు చూసి జనాలు ఓట్లు వేసినట్టయితే... 2023 ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో 7 నియోజకవర్గాలుంటే ఒక్కటైనా గెలిచావా రేవంత్ రెడ్డీ? అని ప్రశ్నించారు..

## రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ

త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎల్ నినో పరిస్థితులు, చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై సూచనలు స్వీకరించాలని నిర్ణయించారు. కరవు మండలాల ప్రకటనతో పాటు తగిన సాయం చేయాలని కేంద్రాన్ని కోరాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే దిల్లీకి వెళ్లి కేంద్రమంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదించాలని నిర్ణయించారు.

### ఈ అంశాలపై చర్చ జరిగే అవకాశం

ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం విధివిధానాలపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. డిసెంబరులో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నిర్వహణపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. కుటుంబ యజమాని మరణిస్తే రూ.5 లక్షల బీమా ఇచ్చే పథకాన్ని వచ్చే నెల 19న ఇందిరాగాంధీ జయంతి రోజున ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశముంది. పాలిటెక్నిక్ లను స్కిల్ యూనివర్సిటీలో విలీనానికి సంబంధించి కేశవరావు కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించి మంత్రివర్గం నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. నిషేధిత భూముల జాబితా నుంచి ఊరట కలిగించే అంశాలు, నూతన పెన్షన్లు, రాజీవ్ యువ వికాసం, హైదరాబాద్ మెట్రో, మూసీ ప్రాజెక్టు, ఆర్ఆర్ఆర్, ఇందిరమ్మ చీరల పంపిణీపైనా చర్చించే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, అంచనాల సవరణపై కేబినెట్ సమాలోచనలు చేస్తుందని సమాచారం.

## 113 కేజీల గోల్డ్ స్మగ్లింగ్ కేసు
# నటి రన్యా రావుకు భారీ జరిమానా

రన్యా రావుకు రూ.89 కోట్ల జరిమానా విధించిన కస్టమ్స్ శాఖ- దుబాయ్ నుంచి బెంగళూరుకు బంగారం అక్రమ రవాణా చేసినట్లు ఆరోపణలు- ఏడాది కాలంలో 113 కిలోల బంగారం రవాణా చేసినట్లు డీఆర్ఐ గుర్తింపు దుబాయ్ నుంచి బెంగళూరుకు బంగారం అక్రమ రవాణా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కన్నడ చిత్రసీమ నటి, మోడల్ రన్యా రావుకు మరో చిక్కు ఎదురైంది. అంతర్జాతీయ బంగారం స్మగ్లింగ్ కేసులో ఆమెకు కస్టమ్స్ శాఖ రూ.89 కోట్ల జరిమానా విధించింది. దీంతో కస్టమ్స్ చట్టం-1962 ప్రకారం ఈ జరిమానాను రన్యా రావు చెల్లించాల్సి ఉంటుంది.

### ఏడాది కాలంలో 113 కిలోల బంగారం

ఆ కేసును దర్యాప్తు చేసిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు, 2024 మార్చి 7 నుంచి 2025 ఫిబ్రవరి 18 మధ్య కాలంలో రన్యా రావుతో పాటు కేసులో నిందితులుగా ఉన్న మరికొందరు దుబాయ్ నుంచి బంగారం అక్రమ రవాణాలో పాల్గొన్నట్లు గుర్తించారు. దర్యాప్తులో వెలువడిన వివరాల ప్రకారం, నిందితులు దాదాపు ఏడాది కాలంలో 113 కిలోల బంగారాన్ని రవాణా చేయడంలో పాలుపంచుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో రన్యా రావుతో పాటు తరుణ్ కొండరాజు, సాహిల్ జైన్, భరత్ జైన్‌లను కూడా అరెస్టు చేశారు.

### ఇతర నిందితులకూ భారీ జరిమానా

రన్యా రావుకు రూ.89 కోట్ల జరిమానా విధించడంతో పాటు కేసులోని ఇతర నిందితులపైనా కస్టమ్స్ శాఖ భారీ మొత్తంలో జరిమానాలు విధించింది. సాహిల్ జైన్, భరత్ జైన్‌లకు చెరో రూ.53 కోట్ల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. తరుణ్ కొండరాజుకు రూ.49 కోట్ల జరిమానా విధించింది. ఆ మొత్తాలను కస్టమ్స్ చట్టం ప్రకారం నిర్దేశించిన విధానంలో చెల్లించాల్సి ఉంటుంది.

### షోకాజ్ నోటీసుల తర్వాత

తాజాగా జరిమానా ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు డీఆర్ఐ అధికారులు నిందితులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారికి విధించనున్న జరిమానాల గురించి ఆ నోటీసుల్లో వివరించారు. ఆ తర్వాత నిందితులు కస్టమ్స్ చట్టంలోని నిబంధనల ప్రకారం నోటీసుల సమీక్షను కోరుతూ సంబంధిత కస్టమ్స్ అధికారిని ఆశ్రయించారు. నిందితుల వాదనలను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. విచారణ ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం కస్టమ్స్ శాఖ తాజాగా జరిమానా ఉత్తర్వులు జారీ చేసింది. నిర్దేశించిన విధానంలో జరిమానా చెల్లించడంలో నిందితులు విఫలమైతే తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వర్తించే నిబంధనల ప్రకారం జరిమానా మొత్తాన్ని వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టవచ్చు. అవసరమైతే నిందితుల ఆస్తులను జప్తు చేయడం సహా తదుపరి వసూలు చర్యలు తీసుకునే అవకాశం

## లోకేశ్‌పై రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశంసలు.. ఇతర నేతలు ఆదర్శంగా తీసుకోవాలని సూచన

మొదటి పేజి తరువాయి

కూడా ఎలాంటి స్క్రిప్ట్ లేకుండా సూటిగా, స్పష్టంగా సమాధానాలు ఇచ్చారని కొనియాడారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే సౌత్ కాంక్లేవ్‌లో రాజ్‌దీప్ సర్దేశాయ్.. మంత్రి లోకేశ్‌ను ముఖాముఖి ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ఏపీ అభివృద్ధి, జాతీయ రాజకీయాలు, ఇతర అంశాలపై పలు ప్రశ్నలు సంధించారు. ఇంటర్వ్యూ చివరలో రాజ్‌దీప్ మాట్లాడుతూ... మీరు అడగబోయే ప్రశ్నల జాబితా ముందే ఇవ్వండి అని అడగని నాయకులను ఇంటర్వ్యూ చేయడం ఎప్పుడూ సులభంగా ఉంటుందని అన్నారు. ఈ ఇంటర్వ్యూపై లోకేశ్ సోషల్ మీడియా వేదికగా నిన్న స్పందించారు. ఈ చర్చలో దేశం గురించి, రాష్ట్రం గురించి, పాలన గురించి, భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడినట్లు వెల్లడించారు.



ఎలాంటి స్క్రిప్ట్ అవసరం లేకుండానే రాజ్‌దీప్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని తెలిపారు. అందుకు రాజ్ దీప్ నేడు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలపై గతంలో నాయకులందరూ ఇలాగే ఉండేవారని, కానీ ఇప్పుడు అది చాలా అరుదుగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఇతర నేతలు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటారని భావిస్తున్నాను అంటూ రాజ్‌దీప్ మంత్రి లోకేశ్ కు కితాబిచ్చారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు - హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తాం: చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

దీనిపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా అర్వపల్లిలో లబ్ధిదారులకు చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేశారు. బీసీ వర్గాలను ఆర్థికంగా, రాజకీయంగా పైకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని చంద్రబాబు తెలిపారు. 45 ఏళ్లుగా టీడీపీకి వెన్నెముకగా ఉన్న బీసీలకు న్యాయం చేస్తామని చెప్పారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. రిజర్వేషన్లు రానీయకుండా వైఎస్సార్సీపీ చాలా కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. "పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాకుండా మానవీయ కోణంలో చూస్తున్నాం. ఏపీలో ఇచ్చే పింఛన్ ప్రపంచంలో ఎక్కడా ఇవ్వడం లేదు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంచాం. పేదల జీవన ప్రమాణాన్ని పెంచే దిశగా పనిచేస్తున్నాం. గడిచిన రెండేళ్లుగా ప్రతి వ్యక్తికి, ప్రతి కుటుంబానికి సాధికారిత తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించుకుంటున్నాం. నాలుగో శనివారం ప్రజల ఆరోగ్యం కోసం సంజీవని ప్రాజెక్టు నిర్వహిస్తున్నాం.పేదల సేవలో పాల్గొనటమే నాకు ముఖ్యం. డ్వాక్రా సంఘాలను శక్తిమంతమైన మహిళలుగా తయారుచేస్తున్నాం. 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేస్తున్నాం. రాష్ట్రంలో మత్స్యకారులు, ఆటో డ్రైవర్లను ఆదుకుంటాం." - చంద్రబాబు, ముఖ్యమంత్రి

ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నాం : వచ్చే ఏడాది మార్చి నాటికి పోలవరం ఫేజ్-1 పూర్తిచేసి కృష్ణా నదికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను రూ.35,000 కోట్లు ఖర్చు పెట్టి పూర్తి చేస్తామన్నారు. సంకల్పంతో ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నట్లు చెప్పారు. దీంతో రాష్ట్రం సస్యశ్యామలమవుతుందని వెల్లడించారు. హంద్రీనీవా ఫేజ్-1 పనులు పూర్తిచేసి కరవు ప్రాంతంలో రిజర్వాయర్లు నింపామని వివరించారు. మార్కాపురం కరవు ప్రాంతం ఎప్పటికీ బాగుపడదని అనుకున్నారని చెప్పారు. 30 ఏళ్లకు ముందు వెలిగొండకు తానే శంకుస్థాపన చేశానని, తానే ఫేజ్-1 పూర్తి చేశానని తెలిపారు. శ్రీశైలం మల్లన్న నుంచి మార్కాపురం చెన్నకేశవస్వామికి కృష్ణమ్మ జలాలు తీసుకొచ్చామని అన్నారు. "పోర్టులు, హార్బర్లు, ఎయిర్‌పోర్టులు పూర్తిచేస్తున్నాం. రాయలసీమను రతనాలసీమ చేస్తామని చెప్పాం చేసి చూపిస్తున్నాం. సిమెంట్ రోడ్లు వేస్తాం, పంచాయతీ రోడ్లు బాగు చేస్తాం. గత ప్రభుత్వం గుంతలు తవ్వింది, మేము పూడుస్తున్నాం. ఎక్కడైనా గుంతలు కనిపిస్తే అధికారులే బాధ్యత వహించాలి. ఎక్కడ చూసినా గుంతలు లేని రహదారులు కనపడాలి. అత్యవసరం కింద రోడ్డు డాక్టర్‌ను తీసుకొస్తున్నాం. రోడ్డుపై గుంతలు కనిపిస్తే వెంటనే పూడ్చేలా ఏర్పాట్లు. సంక్షేమంతో సామాజిక భద్రత అభివృద్ధితో సంపద సృష్టి సాధ్యం. సుపరిపాలనతో నాణ్యమైన, మెరుగైన జీవనం తథ్యం. అభివృద్ధిలో పోటీతత్వం ఉండాలి కుట్రలు కాదు." - చంద్రబాబు, ముఖ్యమంత్రి గత వైఎస్సార్సీపీ సర్కార్ లో



పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదిలి పారిపోయారని, కూటమి ప్రభుత్వంలో వారంతా ఏపీకి క్యూ కడుతున్నారని చంద్రబాబు అన్నారు. రేపల్లెకు వస్తే కొత్త టానిక్ తీసుకున్నంత బలంగా ఉందన్నారు. 'మీ నమ్మకమే మాకు వెయ్యి ఏనుగుల బలం' అని తెలిపారు. ప్రజల దెబ్బకు రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా పోయిందని చెప్పారు. ప్రజల దెబ్బతో జగన్ అలిగాడని అసెంబ్లీకే రానంటున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజలే తమకు ప్రతిపక్షమని వివరించారు. ఇటీవల కొన్ని సర్వేల్లో చూశామని, వైఎస్సార్సీపీ గ్రాఫ్ పడిపోతోందని సీఎం వ్యాఖ్యానించారు. 'చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నా. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నా. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ఈ సందర్భగా అనగాని సత్యప్రసాద్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. భూసమస్యలను అనగాని శాశ్వతంగా పరిష్కరిస్తున్నారని' చంద్రబాబు వివరించారు.

## బీఆర్ఎస్‌తో పొత్తు, ఖైరతాబాద్‌లో బీజేపీ పోటీపై కిషన్ రెడ్డి ఏమన్నారంటే?

మొదటి పేజి తరువాయి

సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, సింగరేణి బొగ్గును వినియోగించుకునేలా ఈ ప్లాంట్‌కు ఎందుకు రూపకల్పన చేయలేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధమైన సంస్థలపై, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌పై అనుచిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మార్పు అనేది ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందే తప్ప, రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. శివుడు,



రాముడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని, వాటిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘంపై, బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతాల వారీగా ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని, తొలగించిన ఓట్లను (మరణించిన వారు, అక్రమ చొరబాటుదారులు) తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు తథ్యమని, తమ పార్టీ ఓట్లను దొంగిలించదని, కేవలం ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## మరో 15 రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు రాక- 'ఎల్ నినో' ఎఫెక్ట్ ఎప్పటి వరకు ఉంటుందంటే?

మొదటి పేజి తరువాయి

ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (చీ×ూు)లో ఈశాన్య రుతుపవనాల అంచనాకు సంబంధించి వివిధ శాఖల ప్రతినిధులతో ఒక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర, తమిళనాడు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్ చంద్రమోహన్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈశాన్య రుతుపవనాలకు సంబంధించి ఐఎండీతో కలిసి చెన్నై వాతావరణ శాఖ ఇలాంటి సమావేశాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారి. ఈ కార్యక్రమంలో ఐఎండీ చీఫ్ మహాపాత్ర కీలక వ్యాఖ్యలు చేశారు. "ఈశాన్య రుతుపవనాలు అక్టోబర్ 15- 21 మధ్య ప్రారంభమయ్యే ఛాన్స్ ఉంది. అదే సమయంలో నైరుతి రుతుపవనాలు మరో 2-3 రోజుల్లో ముగియనున్నాయి. ఈశాన్య రుతుపవనాల కాలంలో దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో సాధారణ వర్షపాతం నమోదవుతుంది. దక్షిణ తమిళనాడు, దక్షిణ కేరళలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ నెలలో దక్షిణ తమిళనాడు, ఉత్తర తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు, కేరళలోని కొండ ప్రాంతాల్లో సాధారణ లేదా సాధారణం కంటే అధిక వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. నవంబర్ చివరి వరకు ఎల్ నినో ప్రభావం బలంగా ఉంటుంది. రుతుపవనాల సమయంలో దక్షిణ ద్వీపకల్పంలోని చాలా ప్రాంతాలలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం చాలా బలంగా ఉంది. ఇది నవంబర్ చివరి వరకు బలంగా ఉండి, ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పడుతుంది. అయితే ఈ ఎల్ నినో ప్రభావం 2027 మార్చి వరకు కొనసాగవచ్చు." అని మహాపాత్ర వ్యాఖ్యానించారు.

### 'ఆ ప్రాంతాల్లో తుపాను ప్రభావం తక్కువ'

ప్రస్తుతం ఎల్ నినో తటస్థ స్థితిలో ఉందన్నారు ఐఎండీ చీఫ్ మహాపాత్ర. అయితే రాబోయే కొద్ది నెలల్లో పాజిటివ్ దశకు మారుతుందని అంచనా వేశారు. తుపానుల దక్షిణ దిశగా ఏర్పడతాయని పేర్కొన్నారు. దీంతో దక్షిణ ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ వంటి దక్షిణ ప్రాంతాలపై తుపాను ప్రభావం తక్కువగా ఉంటుందన్నారు. వాతావరణ పరిస్థితులపై 2021 నుంచి ఐఎండీ కచ్చితమైన అంచనాలను వేస్తోందని చెప్పారు. 20162020 కాలంలో వాతావరణ శాఖ అంచనాల్లో లోపం 7.9 శాతంగా ఉండగా, 20212025 కాలంలో అది 2.2 శాతానికి తగ్గిందని గుర్తు చేసుకున్నారు. ఇది అంచనాల కచ్చితత్వంలో గణనీయమైన పెరుగుదలను సూచిస్తుందని అన్నారు.

### అలా చేయడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించొచ్చు : చంద్రమోహన్

ప్రకృతి వైపరీత్యాలను మనం పూర్తిగా నివారించలేకపోయినప్పటికీ సరైన స్పందన, ముందస్తు జాగ్రత్తల ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తమిళనాడు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్ చంద్రమోహన్ అభిప్రాయపడ్డారు. సమీకృత ప్రణాళిక, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, వివిధ రంగాల ఉమ్మడి కృషి కారణంగా గతంతో పోలిస్తే తమిళనాడులో విపత్తుల తీవ్రత క్రమంగా తగ్గిందని గుర్తు చేశారు. రుతుపవనాల సన్నద్ధత చర్యలకు వాతావరణ సూచనలే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. గత 150 ఏళ్లలో భారత వాతావరణ శాఖ తన సూచనా సామర్థ్యాలను ఎంతో మెరుగుపరుచుకుందన్నారు. ముఖ్యంగా ఇప్పుడు గ్రామ స్థాయి వరకు కూడా కచ్చితమైన



వాతావరణ సమాచారాన్ని అందించే స్థాయికి చేరుకుందని కొనియాడారు. "తమిళనాడు డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ ఏజెన్సీ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,400 ఆటోమేటిక్ వర్షమాపక యంత్రాలను, 100కు పైగా ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఈ ఏడాది మరో 1,000 వర్షమాపక యంత్రాలను ఏర్పాటు చేయనున్నాం. అలాగే భవిష్యత్తులో ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక వర్షమాపక యంత్రాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఈ సాంకేతికత సహాయక, పునరావాస చర్యలను ముందుగానే ప్రణాళిక చేసుకోవడంలోనూ, ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడంలోనూ ఉపయోగపడుతుంది. ఈశాన్య రుతుపవనాలను ఎదుర్కొనేందుకు తమిళనాడు సీఎం విజయ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో క్రమం తప్పకుండా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. " అని చంద్రమోహన్ స్పష్టం చేశారు.

## 9వ తరగతి పాఠ్యపుస్తకంలో కీలక మార్పులు- కొత్తగా ఆదాయపు పన్ను లెక్కలు, పురాతన దేవాలయాల చరిత్ర!

తొలిసారిగా 9వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా పర్సనల్ ఇన్‌కంటాక్స్- కొత్త పన్ను విధానంలోని శ్లాబ్స్ ఆధారంగా టాక్స్ లెక్కించే విధానంపై వివరణ- 1000-1700జు జజు నాటి ఆలయాల ప్రాముఖ్యతను సిలబస్‌లో చేర్చిన

ఢిల్లీ : విద్యార్థులకు చిన్న వయసు నుంచే ఆర్థిక నిర్వహణపై అవగాహన కల్పించేలా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 9వ తరగతి పాఠ్య పుస్తకాల్లోని సిలబస్‌లో కీలక మార్పులు చేసింది. తొలిసారిగా 9వ తరగతి నుంచే వ్యక్తిగత ఆదాయ పన్ను (పర్సనల్ ఇన్‌కం టాక్స్) టాపిక్‌ను చేర్చింది. పన్నులను నిజాయతీగా, నిర్దిష్ట సమయంలోగా చెల్లించడం ప్రతి పౌరుడి ముఖ్యమైన బాధ్యత అనే సందేశాన్ని కూడా పాఠ్యపుస్తకంలో ప్రస్తావించింది . 'అండర్‌స్టాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్- పార్ట్ 2) పేరుతో రూపొందించిన 9వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకాన్ని మంగళవారం రోజు విడుదల చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు 6 నెలల తర్వాత ఈ పుస్తకం అందుబాటులోకి వచ్చింది. ఈ పుస్తకంలోని మొదటి భాగాన్ని జూన్ నెలలోనే విడుదల చేశారు. మరోవైపు క్రీస్తు శకం 1000 నుంచి 1700 మధ్యకాలంలో భారతీయ దేవాలయాల ప్రాముఖ్యంపైనా ప్రత్యేక ఛాప్టర్‌ను తీసుకొచ్చింది.

### కొత్త పన్ను విధానంలోనే టాక్స్ టాపిక్

వాస్తవానికి ఇన్‌కం టాక్స్ అనేది కాస్త క్లిష్టమైన సబ్జెక్ట్. ఆదాయాన్ని బట్టి ఎంత పన్ను పడుతుంది, తగ్గింపులు, మినహాయింపులు ఎలా ఉంటాయి, టీడీఎస్, టీసీఎస్, టాక్స్ ఫైలింగ్, రిఫండ్ ఇలా చాలా అంశాలు ఉంటాయి. కానీ ఇప్పుడు 9 వ తరగతి నుంచే విద్యార్థులు దీని గురించి తెలుసుకోనున్నారు. ఇక 9వ తరగతి విద్యార్థులు మొదటిసారిగా వాస్తవ పన్ను శ్లాబుల ఆధారంగా ఆదాయ




పన్ను ఎలా లెక్కించాలో నేర్చుకునే అవకాశం పొందుతున్నారని చీజజు=ు చీఫ్ దినేశ్ ప్రసాద్ సక్లానీ తెలిపారు. ఇక్కడ కొత్త ఆదాయ పన్ను విధానంలోని టాక్స్ శ్లాబులను టేబుల్ రూపంలో ఇచ్చారు. వాటి ఆధారంగా ఒక వ్యక్తి చెల్లించాల్సిన పన్నును ఎలా లెక్కించాలో దశలవారీగా వివరించారు. అయితే పాత పన్ను విధానం గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం. ప్రస్తుతం పాత, కొత్త రెండు రకాల పన్ను విధానాలు అమల్లో ఉన్నాయి. కానీ 2023, ఏప్రిల్ 1 నుంచే కొత్త పన్ను విధానాన్ని డిఫాల్ట్‌గా మార్చారు. అవసరమైతే పాత పన్ను విధానానికి మారొచ్చు. డబ్బును నిర్వహించే ప్రయాణం చిన్నతనం నుంచే ప్రారంభమవుతుందని 'మేనేజింగ్ యువర్ పర్సనల్ ఫైనాన్సెస్' అనే అధ్యాయంలో వివరించారు. ఇక్కడ డబ్బును సమర్థంగా నిర్వహించడం అంటే ఎక్కువ సంపాదించడం మాత్రమే కాదని, ఖర్చు చేయడం, పొదుపు, పెట్టుబడులు, రిస్క్ నుంచి రక్షణ, బాధ్యతాయుతంగా లోన్లు తీసుకోవడం, పన్నులు చెల్లించడం వంటి అంశాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం కూడా అందులో భాగమేనని ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఈ పుస్తకంలో ఆర్థిక నిర్వహణకు సంబంధించిన 'పిల్లర్స్ ఆఫ్ పర్సనల్ ఫైనాన్స్' అనే విభాగాన్ని కూడా చేర్చారు. దీంట్లో ఆదాయం (సంపాదన), బడ్జెటింగ్ (ఖర్చుల్ని ప్లాన్ చేసుకోవడం), పొదుపు (సేవింగ్స్), పెట్టుబడులు (సంపద సృష్టి కోసం), రక్షణ- రిస్క్ మేనేజ్మెంట్ వంటి అంశాలను వివరించారు. చిన్న వయసులోనే పెట్టుబడులు ప్రారంభించడం వల్ల కలిగే ప్రయోజనాలను 'పవర్ ఆఫ్ ఎర్లీ ఇన్వెస్ట్‌మెంట్స్' అనే ఛాప్టర్‌లో ప్రస్తావించారు. ఇందులో భాగంగా పెట్టుబడుల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బాండ్లు, స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ వంటి ఆప్షన్ల గురించి వివరించింది.

### పురాతన కాలంలో దేవాలయాల ప్రాముఖ్యంపైనా!

రెసిస్టెన్స్ అండ్ రెసిలియెన్స్ (1000- 1700 జజు) అనే అధ్యాయంలో టెంపుల్స్: ది రెసిలెయెన్స్ ఆఫ్ సేక్రేడ్ సైట్స్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని చేర్చారు. ఇక్కడ క్రీస్తు శకం 1000 నుంచి 1700 మధ్య కాలంలో దేవాలయాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆ సమయంలో దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా, రాజకీయం, ఆర్థిక, సామాజిక రంగాల్లో కూడా ఎలా అత్యంత కీలకంగా ఉండేవో వివరించారు. దీని గురించి కూడా 9వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోనే పేర్కొన్నారు. అప్పట్లో పాలకులు ఆలయాలకు విరాళాలు అందించడం ద్వారా తమ రాజకీయ అధికారాన్ని బలపర్చుకునేవారని ఇందులో వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో ఆలయ దేవతలను రాజ్యం, ప్రజలకు రక్షకులుగా భావించేవారని కూడా ఈ ఛాప్టర్‌లో వివరించారు. ఇంకా అప్పటి నుంచే ఆలయాలు భూముల్ని నిర్వహించడం, స్థానిక వ్యాపారులకు రుణాలు ఇవ్వడం, స్థానికంగా పన్నులు వసూలు చేయడం వంటి విధుల్ని నిర్వహించేవి. శిల్పులు, నృత్యకారులు, పూజారులు, సంగీత కళాకారులకు ఉపాధి కల్పించేవి.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com

# మహాత్మా గాంధీ మార్గం అందరికీ ఆదర్శం

**–పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష.**

**గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**పరిగి పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, పరిగి పిఎసిఎస్ వైస్ చైర్మన్ రాజు పుల్లారెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్, పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీ వెంకట రాములు, పరిగి పట్టణ అధ్యక్షుడు గుండెల రామకృష్ణారెడ్డి లు గాంధీ విగ్రహానికి పూలమాల లేసి ఘనంగా నివాళులు అర్పించారు**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): మహాత్మా గాంధీ చూపిన మార్గం అనుసరించిన విధానాలు అందరికీ ఆదర్శనీయమని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పరిగి పట్టణంలోని గాంధీ చౌక్ లో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ పాల్గొన్నారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గాంధీ జయంతిని భక్తిశ్రద్ధలతో సర్వమత ప్రార్థనలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ప్రతి సంవత్సరం సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలు నిర్వహించడానికి పరిమితం మహాత్మా గాంధీ ఆశయ సాధన కోసం కృషి చేయాలని తెలిపారు. గాంధీజీ సిద్ధాంతాలను విధానాలను అనుసరించడం ద్వారా దేశభక్తి విలువలు పొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పంతులు, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యుబ్, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, డిసిసి ప్రధాన కార్యదర్శి (నస్కల్) దండు అశోక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లాల్ కృష్ణ ప్రసాద్, కౌన్సిలర్లు యూసుఫ్, ఆరిఫ్ పటేల్ ,చంద్రయ్య,బాదం అఖిల శ్రీనివాస్ గుప్తా, కో ఆప్షన్ సభ్యులు ఆంజనేయులు, అక్బర్ , పిఎసిఎస్ డైరెక్టర్ చిన్న నరసింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ గని, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులు

**– మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి**




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పట్టణంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. సత్యం, అహింస మార్గం ద్వారా స్వాతంత్ర ఉద్యమాన్ని కొనసాగించిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అన్నారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో శాంతియుతంగా సహాయ నిరాకరణ, శాసన ఉల్లంఘన ఉద్యమాలను కొనసాగించి స్వాతంత్రం తీసుకురావడానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, మీరు తాహిర్ అలీ, రవికుమార్, బి ఆర్ ఎస్ నాయకులు ఏదిర కృష్ణ, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యాలయానికి తాళం!

**గుడిలో గ్రామ సభ...**

**ఉప సర్పంచ్, ఆరుగురు వార్డు సభ్యులుండగా...**

**పంచాయతీ కార్యాలయం తాళం..!**




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): గాంధీ మహాత్ముడి ఫోటో సాక్షిగా, గాంధీ జయంతి నాడు ఉప సర్పంచ్, ఆరు గురు వార్డు మెంబర్లను అవమానపరిచి గుడి ఆవరణలో గ్రామ సభ నిర్వహించారంటూ మిట్టకోడూరు గ్రామ మెజార్టీ వార్డు సభ్యులు ఆవేధన వ్యక్తం చేశారు. పరిగి మండల మిట్టకోడూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించే గ్రామ సభ రచ్చకెక్కింది. గ్రామ ఉప సర్పంచ్ మల్లేష్, మరో ఆరుగురు వార్డు సభ్యలతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాయంలో టెంట్ వేయించి గ్రామ సభ నిర్వహించాలనుకున్నారు. గ్రామ సర్పంచ్ మాణిక్యం పంచాయతీ కార్యాలయం వద్ద కాకుండా మాణిక్ ప్రభు గుడి ఆవరణలో గ్రామ సభ నిర్వహించాడు. గ్రామసభ గుడి ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కనీస సమాచారం ఇవ్వకుండా తూతూ మంత్రంగా గ్రామ సభ నిర్వహించారంటూ ఉప సర్పంచ్ మల్లేష్, ఆరుగురు వార్డు సభ్యులు ఆరోపించారు. పంచాయతీ కార్యాలయం వద్ద టెంట్ వేసి ఏర్పాటు చేస్తే తీరా చివరి నిమిషంలో గుడి వద్ద గ్రామ సభ మేమంతా లేకుండానే నిర్వహించడం ఎంత వరకు కరెక్టంటూ ప్రశ్నించారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు గ్రామ సభ కోసం వేసిన టెంట్ పోలీసులు పేకేయించడం పై గ్రామస్తులు తప్పుపడుతున్నారు. సర్పంచ్ హోదాలో ఉండి అందరిని కలుపుకోవాల్సింది పోయి ఉప సర్పంచ్, వార్డు మెంబర్లను పట్టించుకోకుండా ఒకే ఊరిలో గులాబీ పార్టీకి చెందిన వారే రెండు చోట్ల గ్రామ సభలు నిర్వహించడంపై చర్చనీయాంశంగా మారింది.

# ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

**మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి: జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్) : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్ సమావేశము హాలు నందు శుక్రవారం గాంధీజీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయమని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు నిబద్ధతతో సేవలందిస్తూ గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, మెప్మా రవికుమార్, గ్రౌద్ వాటర్ రవి, సెక్షన్ సుపరింన్డేంట్ భరత్, రమేష్, సి సి లు నరేందర్, రామకృష్ణ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కరవు సీమను సిరులసీమగా మారుస్తాం...

## ఉద్యానరంగ అభివృద్ధితో ఆర్థికాభివృద్ధి




మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 2: కరవుసీమగా పేరున్న రాయలసీమను సిరుల సీమగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. 2024 ఎన్నికల్లో కూటమిని గెలిపించిన మరుక్షణం నుంచి ప్రజలకు మేలు చేయాలనే తలంపుతో ఉన్నామని... దాంట్లో భాగంగానే రాయలసీమలోని ఎనిమిది జిల్లాలు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఉద్యాన రైతులకు మేలు చేసేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టామని చెప్పారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం గ్లోబల్ హార్టికల్చర్ హబ్ జీహెచ్చెచ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్- ఐఎస్ఏ కు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. కేంద్ర సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడులతో మరో రూ.60 వేల కోట్లను సమీకరించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్మాగాంధీ ఆశయాన్ని సాకారం చేసే దిశగా రాయలసీమలో చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో కరవుసీమను రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఉద్యాన రంగం ప్రాథమిక రంగం వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం సుమారు



రూ.1.50 లక్షల కోట్ల జీవీఏ అందిస్తున్న ఈ రంగం ద్వారా మరో రూ.లక్ష కోట్ల జీవీఏను సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా 5,860 గ్రామాలను 201 క్లస్టర్లుగా అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 6 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరించేలా ఈ ప్రాజెక్టులో కార్యాచరణ చేపట్టనున్నామన్నారు. రైతులకు ఉత్పత్తి నుంచి మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతుల వరకు సమగ్ర మద్దతు అందించడమే హార్టికల్చర్ హబ్ ప్రధాన ఉద్దేశమని సీఎం చంద్రబాబు చెప్పారు. పంటల స్థిరీకరణతో పాటు ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. యాపిల్, స్ట్రాబెరీ నుంచి అరటి, ఆవకాడో, కివీ, ఖర్జూరం వరకు వివిధ రకాల ఉద్యాన పంటలకు ప్రోత్సహం అందించనున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలను అభివృద్ధి చేసి రైతులకు మేలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సీడ్ టు షిప్‌మెంట్ వ్యవస్థల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించేలా కార్యక్రమాలను అమలు చేయనున్నామని సీఎం వెల్లడించారు.

### సాగునీరందిస్తాం... బంగారం పండించండి

సాగునీరు అందిస్తే రాయలసీమ ప్రజలు బంగారం పండిస్తారని, మార్కెటింగ్ ద్వారా సంపద సృష్టిస్తారని సీఎం పేర్కొన్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి తదితర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని, రూ.3,500 కోట్లతో హంద్రీ-నీవా కాలువను పూర్తి చేసి కుప్పం వరకు నీటిని తీసుకెళ్లామని చెప్పారు. వెలిగొండ మొదటి దశను పూర్తి చేసి మార్కాపురానికి, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటిని అందించామని వివరించారు. మరో రూ.35 వేల కోట్లతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. రాయలసీమలో హంద్రీ-నీవా, మడకశిర బ్రాంచ్ కెనాల్, మల్లెమడుగు, బాలాజీసాగర్, అప్పర్ పేరూరు తదితర ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంలో సవాళ్లు పెరుగుతున్నాయని సీఎం అన్నారు. గోదావరిలో ఈ ఏడాది కూడా సుమారు 1,600 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని, పట్టిసీమ ద్వారా పదేళ్లలో సుమారు 500 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు తరలించామని తెలిపారు. కృష్ణా డెల్టాలో పొదుపు చేసిన నీటిని రాయలసీమకు తరలించడం నదుల అనుసంధానం వల్లే సాధ్యమైందన్నారు. వచ్చే ఏడాది పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. పవర్ గ్రిడ్, రోడ్ గ్రిడ్, డిజిటల్ కనెక్టివిటీ మాదిరిగా వాటర్ గ్రిడ్ అవసరమని చెప్పారు. గోదావరి నుంచి కావేరి వరకు నీటిని అనుసంధానం చేసే అంశాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గోదావరి-కావేరి అనుసంధానంతో రాయలసీమ కరవు తీరడంతోపాటు... దక్షిణాదిలోని 4 రాష్ట్రాల మధ్య నెలకొనే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. రిలయన్స్ సంస్థ సహకారంతో మదనపల్లెలో ఏర్పాటు కానున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా వ్యవసాయం, ఉద్యానవనం, ఆధునిక సాంకేతికత, పరిశోధన, కృత్రిమ మేధ వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ఈ సంస్థను తీర్చిదిద్దనున్నట్టు వెల్లడించారు. ఐఐఎంలో మేనేజ్‌మెంట్ నిపుణులు, ఐఐటీలో సాంకేతిక నిపుణులు, ఐఎస్‌బీలో పారిశ్రామిక నైపుణ్యాలు అభివృద్ధి చెందినట్లే.. ఐఎస్ఏ ద్వారా వ్యవసాయ రంగంలో నాయకత్వ నైపుణ్యాలు కలిగిన నిపుణులను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు.

### ఉక్కు మహిళ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి, దేశ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అందిస్తున్న సహకారాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం తదితర ప్రాజెక్టులకు కేంద్రం సహకరిస్తోందన్నారు. దేశ నిర్మాణంలో నిర్మలా సీతారామన్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ నెక్స్ట్‌జెన్ సంస్కరణలు, డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల్లో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల ద్వారా దేశాన్ని బలోపేతం చేస్తున్న ఉక్కు మహిళ నిర్మలా సీతారామన్ అని సీఎం అన్నారు. ఓ మహిళే ఇంటిని చక్కగా తీర్చిదిద్దే సత్తా మహిళకు మాత్రమే ఉంటుందని.. అదే విధంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మలా సీతారామన్ తీర్చిదిద్దుతున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆమెకున్న నాయకత్వ పటిమను గుర్తించే ప్రధాని మోదీ ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు నిధులు కేటాయించే విషయంలో నిర్మలా సీతారామన్ చూపిన చొరవను.. ఇచ్చిన సహకారాన్ని మరువలేమన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో అభివృద్ధి-సంక్షేమం చేయగలుగుతోందంటే దానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన రిలయెన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తన పెద్ద మనస్సును చాటుకున్నారన్నారు. వ్యవసాయం, ఉద్యాన రంగాల్లో పరిశోధన, ఆధునిక సాంకేతికత, ఏఐ వినియోగంతో పాటు రైతులకు అవసరమైన మద్దతు వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో రిలయన్స్ సంస్థ సహకారం అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. సీడ్ టు షిప్‌మెంట్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో మరింతగా భాగస్వామ్యం కావాలని సూచించారు. తిరుమల శ్రీవారిపై భక్తితో ఈవీ బస్సులను సమకూర్చిన అనంత్ అంబానీ సేవలను సీఎం ప్రస్తావించారు. అలాగే అనంత్ అంబానీ వంతారా వంటి వ్యవస్థను ఏర్పాటు చేసి జంతువులకు సైతం సేవలు అందిస్తున్న గొప్ప పర్యావరణ ప్రేమికుడు అనంత్ అంబానీ అని కొనియాడారు. అనంత్ అంబానీ తన తాత, తండ్రుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని వారి బాటలో నడుస్తున్నారని సీఎం చంద్రబాబు చెప్పారు.

### ప్రత్యేక ఆకర్షణగా అనంత్ అంబానీ

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌తో తన అనుబంధాన్ని చాటుకుంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. తనను ఆంధ్రా బిడ్డగా భావించాలని, రాష్ట్రానికి తాను ఏం చేయగలనో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగం ఆకట్టుకుంది. అనంత్ అంబానీ ప్రసంగం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆయనను అభినందించారు. అనంతరం సీఎం చంద్రబాబు అనంత్ అంబానీని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత ప్రసంగించిన ముఖ్యమంత్రి అనంత్ అంబానీ చెప్పిన మాటలను స్పందించారు. అనంత్ అంబానీని ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డగా భావిస్తున్నామని సీఎం వేదికపై ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశం సందర్భంగా సభలో వక్తల ప్రసంగాలకు ముందు ప్రత్యేక వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి, రైతుల ఆదాయ పెంపు, నీటి వనరుల వినియోగం, ఆధునిక సాగు విధానాలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతుల అవకాశాలను ఈ వీడియోలో వివరించారు. కార్యక్రమం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మొక్కలను నాటారు. అలాగే ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అన్నమయ్య జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రాయలసీమను దేశానికి "పవర్ హౌస్ ఆఫ్ ఇండియా"గా తీర్చిదిద్దే దిశగా అడుగులు




మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 2: రాయలసీమలో వ్యవసాయ రంగాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేస్తూ, యువతకు వ్యవసాయ నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా ప్రపంచంలోనే ప్రత్యేకమైన ఇండియన్ స్కూల్ ఫర్ అగ్రికల్చర్ను ఏర్పాటు చేస్తున్నారని బి జే పి రాష్ట్ర అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్ తెలిపారు. గతంలో దేశంలో తొలిసారిగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మహాత్మా గాంధీ జయంతి రోజున రాయలసీమలో ప్రపంచంలోనే ప్రత్యేకమైన ఇండియన్ స్కూల్ ఫర్ అగ్రికల్చర్కు శ్రీకారం చుడుతున్నారని పేర్కొన్నారు. ఈ సంస్థలో మాస్టర్స్ ఇన్ అగ్రికల్చర్ లీడర్‌షిప్, మాస్టర్స్ ఇన్ డిజిటల్ అగ్రికల్చర్ వంటి కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా యువతకు వ్యవసాయ రంగంలో నాయకత్వ నైపుణ్యాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించనున్నట్లు తెలిపారు. తద్వారా వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా సాంకేతికత, ఆవిష్కరణలు, వ్యాపార అవకాశాలతో కూడిన ఆధునిక రంగంగా తీర్చిదిద్దే అవకాశం ఏర్పడుతుందన్నారు.

### రాయలసీమకు కొత్త గుర్తింపు

గతంలో రాయలసీమ అంటే వెనుకబడిన ప్రాంతం, కరువు నేల, సంక్షోభాలతో సతమతమయ్యే ప్రాంతం అనే అభిప్రాయాలు ఉండేవని, ఇకపై సస్యశ్యామలమైన రాయలసీమ, సమృద్ధి సాధించిన రాయలసీమ, సిరుల రాయలసీమ వంటి పదాలు వినిపించేలా ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాయలసీమను దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకమైన లి"పవర్ హౌస్ ఆఫ్ ఇండియా"లి గా తీర్చిదిద్దే దిశగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని 11 ఎకనామిక్ కారిడార్లలో మూడు రాయలసీమ ప్రాంతం గుండా వెళ్తున్నాయని, హైదరాబాద్--బెంగళూరు--చెన్నై నగరాలను అనుసంధానం చేస్తూ పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే రాయలసీమలో డిఫెన్స్ కారిడార్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కూడా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు.

### ఉద్యానవన రంగానికి రాయలసీమ అనుకూలం

రాయలసీమ ప్రాంతం ఉద్యానవన పంటలకు అనుకూలమైన వాతావరణం, భౌగోళిక పరిస్థితులను కలిగి ఉండటంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించే పంటలకు విలువ జోడించి, వాటిని దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంస్కరణలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మన్ కీ బాత్ కార్యక్రమంలో రాయలసీమకు చెందిన యువ రైతు వాసుదేవ రెడ్డి గురించి ప్రస్తావించారని తెలిపారు. చీని పంట సాగు చేసే భూమిలో అవకాడో సాగు చేపట్టి, ఎకరాకు సుమారు 10 టన్నుల వరకు దిగుబడి సాధించడం ద్వారా ఆయన వినూత్న వ్యవసాయానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. అదేవిధంగా చెన్నూరు ప్రాంతంలో తమలపాకు సాగు ద్వారా కోట్ల రూపాయల ఆదాయం పొందుతున్న రైతుల విజయగాథలు కూడా రాయలసీమ రైతుల సామర్థ్యానికి నిదర్శనమని తెలిపారు.

### రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో హార్టికల్చర్ హబ్

రైతులు పండించిన పంటలకు వాల్యూ అడిషన్, ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, మార్కెటింగ్ తదితర సౌకర్యాలను కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ పెట్టుబడులతో హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేస్తున్నాయని తెలిపారు. ఈ పెట్టుబడులను రహదారులు, మౌలిక వసతులు, రవాణా, ఆధునిక వ్యవసాయ సదుపాయాలు, మార్కెట్ అనుసంధానం వంటి రంగాల అభివృద్ధికి వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా రాయలసీమ రైతులు కేవలం దేశీయ మార్కెట్‌కే పరిమితం కాకుండా ప్రపంచ మార్కెట్లకు ఎగుమతిదారులుగా ఎదిగే అవకాశాలు ఏర్పడనున్నాయని తెలిపారు.

### స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహం

నీతా అంబానీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలు, స్వదేశీ భావనపై ఉన్న అభిమానం నేపథ్యంలో స్వదేశీ స్టోర్స్ను ప్రారంభించారని తెలిపారు. ఈ స్టోర్ల ద్వారా దేశవ్యాప్తంగా చేతివృత్తులు, సంప్రదాయ కళలు, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, దాదాపు 70 వేల మంది చేతివృత్తి కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్, ఆదరణ లభించేలా అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. రాయలసీమలో రైతులు పండించే ఉద్యాన పంటలు, స్థానిక ఉత్పత్తులు, చేతివృత్తులు, గ్రామీణ ఆధారిత పరిశ్రమలకు కూడా ఇలాంటి మార్కెట్ అనుసంధానం కల్పించడం ద్వారా రైతు ఆదాయం పెంపు, యువతకు ఉపాధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం సాధ్యమవుతుందని తెలిపారు.

# తొలి ముద్ద" కార్యక్రమం - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): మహిళా శిశు సంక్షేమ శాఖ వికారాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన "తొలి ముద్ద" అనే కార్యక్రమం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రామయ్య గూడ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం (దీతీమ్ఘఎట్ఘిర్) అందించేందుకు చేపట్టిన కార్యక్రమమును జడ్పీ సీఈఓ శ్రీ సుధీర్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు . దీని ప్రధాన లక్ష్యం చిన్నారుల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి అవసరమైన పోషకాహారం అందించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ అర్థా సుధాకర్ రెడ్డి, 19 వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి జగదీశ్వరి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీ. కె. కాంతారావు, స్థానిక సీడీపీఓ శ్రీమతి శ్రీలత, స్థానిక సూపర్ వైసర్ శ్రీమతి షాలిని, మరియు తదితరులు పాల్గొన్నారు



# గాంధీజీ ఆశయాలు నేటికీ మార్గదర్శకం

## సత్యం, అహింస మార్గంలో పయనిద్దాం

## సమసమాజ నిర్మాణానికి కృషి చేద్దాం: మంత్రి పయ్యావుల కేశవ్




కర్నూలు, అక్టోబర్ 2: (మహి న్యూస్): సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, స్వాతంత్ర్య సాధనలో కోట్లాది భారతీయులకు స్ఫూర్తినిచ్చిన జాతిపిత మహాత్మా గాంధీకి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. సమాజంలో శాంతి, సమానత్వం, సౌభ్రాతృత్వం నెలకొల్పాలన్న గాంధీజీ ఆశయాలు నేటికీ అందరికీ మార్గదర్శకాలని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గంలో పయనిస్తూ సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు.

# కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఘన స్వాగతం

## 'హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్' కార్యక్రమానికి హాజరు

## రూ.1 లక్ష కోట్ల అభివృద్ధి ప్రణాళికకు శ్రీకారం





అనంతపురం, అక్టోబర్ 2: (మహి న్యూస్): అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం బి.కె.పల్లిలో శుక్రవారం నిర్వహించిన 'హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్' కార్యక్రమానికి హాజరైన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఘన స్వాగతం పలికారు. రాయలసీమ స్వర్ణ భవిష్యత్తు లక్ష్యంగా రూ.1 లక్ష కోట్ల అభివృద్ధి ప్రణాళికకు శ్రీకారం చుట్టడంతో పాటు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.



# నిర్మలా సీతారామన్‌కు ఘన స్వాగతం



అనంతపురం, అక్టోబర్ 2: (మహి న్యూస్): అన్నమయ్య జిల్లా మదనపల్లె బి.కొత్తపల్లిలో 'హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్' కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఘన స్వాగతం పలికారు. రాయలసీమ అభివృద్ధికి రూ.1 లక్ష కోట్ల ప్రణాళికకు శ్రీకారం చుట్టడంతో పాటు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.

# హార్టికల్చర్ హబ్‌తో రాయలసీమకు కొత్త అవకాశాలు



## రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్

## రైతుల ఆదాయం పెంపే ప్రధాన లక్ష్యం

## అనంతపురంలో 41 క్లస్టర్ల ఎంపిక

అనంతపురం, అక్టోబర్ 2: (మహి న్యూస్): రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా 'హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. మదనపల్లిలో జరిగిన కార్యక్రమాన్ని అనంతపురం కలెక్టరేట్ నుంచి ఎంపీ, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి తదితరులు వర్చువల్‌గా వీక్షించారు. రూ.1 లక్ష కోట్ల ప్రణాళికలో భాగంగా ఉద్యాన పంటల సాగు విస్తరణ, సాగునీరు, రహదారులు, కోల్డ్‌స్టోరేజీలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులకు మౌలిక వసతులు కల్పించనున్నట్లు ఎంపీ తెలిపారు. రాయలసీమలో సాగు విస్తీర్ణాన్ని 6 లక్షల ఎకరాల నుంచి 15 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో 32 మండలాల్లో 41 క్లస్టర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉద్యాన పంటల విస్తరణ, రైతుల ఆదాయం పెంపు, నీటి వినియోగ సామర్థ్యం, మౌలిక వసతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం మదనపల్లిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేసినట్లు అధికారులు తెలిపారు.



# గాంధీజీ విగ్రహానికి ఘన నివాళులు

## జయంతి సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళులు

## కలెక్టరేట్‌లో పూలమాలలు వేసిన డీఆర్ఓ ఏ. మలోల





అనంతపురం, అక్టోబర్ 2: (మహి న్యూస్): జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అనంతపురం కలెక్టరేట్ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి డీఆర్ఓ ఏ. మలోల పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖైదీలు సత్ప్రవర్తనతో జనజీవన స్రవంతిలో కలవాలి

## జైలు తర్వాత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలి

## ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి -జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



అనంతపురం, అక్టోబర్ 2: (మహి న్యూస్): ఖైదీలు సత్ప్రవర్తనతో మార్పు చెంది తిరిగి జనజీవన స్రవంతిలో గౌరవప్రదంగా జీవించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా అనంతపురం కేంద్ర కారాగారంలో నిర్వహించిన ఖైదీల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత స్వయం ఉపాధితో జీవించేందుకు జైలులో నిర్వహించే జీవనోపాధి కార్యక్రమాల్లో ఖైదీలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వ సహకారం అందిస్తామని తెలిపారు. జైలు గ్రంథాలయంలో మంచి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమానికి ముందు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇలియాస్ భాష, డీడీఎంకే అనురాధ, జిల్లా జైలు సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, జైలు అధికారులు, ఖైదీలు పాల్గొన్నారు.



# బొగ్గు బట్టీల నుంచి 95 మంది వలస కూలీలకు విముక్తి

## చిన్నారులు సహా 95 మంది ఆదివాసీ వలస కూలీల రక్షణ

## బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో ప్రత్యేక తనిఖీలు

## వెట్టిచాకిరీ నిరోధక చట్టం కింద కేసులకు ఆదేశాలు

## బాధితులకు పునరావాసం, ఆర్థిక సాయం

అనంతపురం, అక్టోబర్ 2: (మహి న్యూస్): అనంతపురం జిల్లాలోని బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో బొగ్గు బట్టీలపై నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో చిన్నారులు సహా 95 మంది ఆదివాసీ వలస కూలీలను వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించినట్లు జిల్లా కార్మిక శాఖ అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30న రెవెన్యూ, పోలీస్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, కార్మిక శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. బొమ్మనహాళ్‌లో 40 మంది, డి.హీరేహాళ్‌లో 55 మందిని గుర్తించి రక్షించారు. వీరిలో పురుషులు, మహిళలు, వృద్ధులతో పాటు మూడో వంతుకు పైగా చిన్నారులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోని రాయ్‌గడ్ జిల్లాకు చెందిన కూలీలు యజమానుల నుంచి తీసుకున్న అడ్వాన్సుల పేరుతో తమను నిర్బంధించి బలవంతంగా పని చేయిస్తున్నారని అధికారులకు వివరించినట్లు తెలిపారు. రక్షించిన కూలీలకు సెప్టెంబర్ 30న కల్యాణదుర్గం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ద్వారా వెట్టిచాకిరీ పునరావాస పథకం కింద విముక్తి పత్రాలు అందజేశారు. అనంతరం ఏపీఎస్ఆర్టీసీ బస్సుల ద్వారా వారిని సురక్షితంగా రాయ్‌గడ్ జిల్లాకు తరలించారు. వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం-1976లోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని అధికారులు పోలీసులను కోరారు. బాధితులకు కేంద్ర ప్రభుత్వ పథకం కింద తక్షణ ఆర్థిక సాయంతో పాటు ఉపాధి, పిల్లల విద్య, వైద్య సదుపాయాలు వంటి పునరావాస ప్రయోజనాలు కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని బొగ్గు బట్టీలు, ఇటుక బట్టీలు, క్వారీలు, రైస్ మిల్లులు, వ్యవసాయ క్షేత్రాల్లో త్వరలో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించనున్నట్లు కార్మిక శాఖ వెల్లడించింది. వెట్టిచాకిరీ, బాలకార్మికులు లేదా బలవంతంగా నిర్బంధించబడిన వలస కూలీల సమాచారం ఉంటే సమీప తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ లేదా జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయానికి 9492555187 నంబర్ ద్వారా సమాచారం అందించాలని అధికారులు కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.










# కనకాలపేటలో ఘనంగా గణపతి నవరాత్రి వేడుకలు

## శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి సన్నిధిలో భారీ అన్న సమారాధన.

యానాం,మహి న్యూస్, అక్టోబర్ 2: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం శివారు కనకాలపేట రామాలయం సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గత పలు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజూ స్వామివారిని వివిధ అలంకరణలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తుల జయజయధ్వానాలు, వినాయక నామస్మరణల మధ్య ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. ఈ క్రమంలో ఉత్సవాల ముగింపు రోజున నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గత 18 సంవత్సరాలుగా ఎలాంటి విరామం లేకుండా శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తుల సహకారంతో ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులతో గ్రామంలో సుఖసంతోషాలు, సౌభాగ్యం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాల నిర్వహణకు ఆర్థికంగా, హార్దికంగా సహకరించిన దాతలు, భక్తులు, గ్రామస్థులు, యువతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అన్న సమారాధన కార్యక్రమానికి యానాం ఎస్పీ వరదరాజన్, సీఐ సురేష్ బాబు, పోలీసు సిబ్బంది హాజరై శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు పోలీసు అధికారులకు ఆత్మీయ స్వాగతం పలికారు. అన్న సమారాధనలో భాగంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. గ్రామస్థులు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం, తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తులంతా ఒకచోట చేరి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించడంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కోన కొండబాబు, కాటం శెట్టి రామ్మూర్తి, హంసాని రామలక్ష్మణుడు, కవల కోటేశ్వరరావు, కోన సుబ్బారావు, కోన రామచంద్రరావు, కనకాల సత్తిబాబు, కోన మురళి, కోన దేవా, కోన విష్ణు, గొర్రెల రాజేష్, కోన సత్తయ్య, కోన భవాని, సోమిశెట్టి శివ, కోన ఆదినారాయణ, కోన వెంకట్రావు, కోన చంటిబాబు,కోన సూరిబాబు,యర్రంశెట్టి చక్రం, గొర్రెల వీరబాబు, గొర్రెల వెంకటరత్నం, కవల వెంకటేష్, కనకాల హరిబాబు,కోన బాబులు,తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, యువత, స్థానిక ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ భారీ అన్న సమారాధనతో కనకాలపేటలో భక్తి భావం వెల్లివిరిసింది. 18 ఏళ్లుగా సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్న ఉత్సవాలను భవిష్యత్తులోనూ మరింత వైభవంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు ఆకాంక్షించారు. స్వామివారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థిస్తూ అన్న సమారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ముగించారు.





# శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి

# ప్రతిష్టాత్మక 'స్వచ్ఛ ఆంధ్ర అవార్డు - 2026'




విజయవాడ, మహి న్యూస్, అక్టోబర్ 2 : పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో విశేష ప్రమాణాలు పాటిస్తున్న విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మక పురస్కారం దక్కింది. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ఇనిషియేటివ్స్ (సాసా)' లో భాగంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం రాష్ట్ర స్థాయి 'స్వచ్ఛ ఆంధ్ర అవార్డు -- 2026' నకు ఎంపికైంది. ?శుక్రవారం సాయంత్రం విజయవాడలోని 'ఏ-కన్వెన్షన్ సెంటర్' లో ఘనంగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో దేవస్థానం తరపున కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఈ పురస్కారాన్ని రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత (30%), వ్యర్థాల విభజన మరియు సేకరణ (25%), స్వచ్ఛమైన మరియు నిరంతరం పనిచేసే మరుగుదొడ్ల నిర్వహణ (20%), పరిసర ప్రాంతాల పారిశుద్ధ్యం (15%), ప్లాస్టిక్ రహిత విధానాలు మరియు భక్తులలో అవగాహన కల్పించడం (10%) వంటి కీలక ప్రాతిపదికలలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు గాను దేవాదాయ శాఖ పరిధిలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈ ఘనత సాధించింది. ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఇంద్రకీలాద్రిపై పారిశుద్ధ్య నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం, దేవాదాయ ఉన్నతాధికారులు అందిస్తున్న మార్గదర్శకత్వంతో పాటు దేవస్థాన పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది నిరంతరం చేస్తున్న కృషికే ఈ గుర్తింపు దక్కిందని, ఇదంతా అమ్మవారి అనుగ్రహమని పేర్కొన్నారు. రానున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో కూడా పర్యావరణహితంగా, స్వచ్ఛతకు పెద్దపీట వేస్తూ భక్తులకు మెరుగైన సేవలందిస్తామని తెలిపారు.

# పరిశుభ్రత, అహింసా మార్గాలే నిజమైన పురోగతికి బాటలు

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్



శ్రీకాకుళం, మహి న్యూస్, అక్టోబర్ 2: మహాత్ముడు బోధించిన పరిశుభ్రత అంటే కేవలం చెత్తను ఎత్తివేయడం మాత్రమే కాదని, మనుషుల ఆలోచనలు, మనస్సులు కూడా శుభ్రంగా ఉంచుకోవడమే నిజమైన పరిశుభ్రత అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి నిర్వహించిన మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో అలవర్చుకోవాల్సిన ముఖ్యమైన అలవాటని పేర్కొన్నారు. దేశంలో యువత, ఉద్యోగులు తమ సమస్యలపై పోరాడేటప్పుడు గాంధీజీ చూపిన అహింసా మార్గాన్నే ఎంచుకోవాలని, హింసకు తావులేకుండా వ్యవస్థలను ఇబ్బంది పెట్టకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్ భవనంలోని ప్రతి విభాగంలో గాంధీజీ సూక్తులను ప్రదర్శిస్తామని, ఇవి ఉద్యోగులు, ప్రజల్లో మంచి మార్పుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన హరిత విప్లవం, సరిహద్దు దళాల పటిష్టత వంటి సేవలు అజరామరమని కలెక్టర్ కొనియాడారు. ఒకవైపు వ్యవసాయ ఆధారితంగా ఉంటూనే, మరోవైపు దేశ రక్షణ దళాలకు అనేక మంది సైనికులను అందిస్తున్న శ్రీకాకుళం జిల్లాకు శాస్త్రి గారి ఆశయాలు నిరంతరం ప్రేరణనిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ ఏదైనా విధానాన్ని ప్రారంభించే ముందు సమాజంలో ఉన్న అట్టడుగు వారిని గుర్తు చేసుకొని ముందుకు నడవాలని మహాత్ముని సందేశమని పేర్కొన్నారు. సేవలలో సానుభూతి పారదర్శకత జవాబు దారి తనము పాటించడము మనము వారి కల్పించే నిజమైన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# యానాం మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షుడిగా

# సాధనాల రమేష్ నియామకం



యానాం, మహి న్యూస్, అక్టోబర్ 2: కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షుడిగా సాధనాల రమేష్ నియమితులయ్యారు. మెగాస్టార్ కొణిదెల చిరంజీవి, కొణిదెల సుస్మిత ఆయనను ఈ పదవిలో నియమించారు. యానంలో మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు అండగా నిలుస్తూ, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా సంస్థను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాధనాల రమేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన చిరంజీవి, సుస్మితకు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ సుధా వెంకటేష్, రాష్ట్ర కోకన్వీనర్ వెలగా వెంకటేష్, జాతీయ కన్వీనర్ ఏడిద బాబి లకు, మరియు స్నేహితులకు, మెగా అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. యానంలో మెగా యూత్ ఫోర్స్ ద్వారా పేదలకు సహాయ సహకారాలు అందిస్తూ, సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తానని తెలిపారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



# జాతిపిత జయంతి రోజున మాచర్లలో మత్తుపానీయాలపై అవగాహన ర్యాలీ



మాచర్ల అక్టోబర్ : 02 ( మహి న్యూస్ ): జాతిపిత మహాత్మా గాంధీ 158వ జయంతి సందర్భంగా శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మాచర్లలో మత్తుపానీయాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మద్యపానం, మాదకద్రవ్యాలు, గుట్కా, పాన్ పరాగ్, ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలని యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల ఎస్సై స్వర్ణలత హాజరయ్యారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై పెడదారిన పడుతున్నారని, వారిలో చైతన్యం తీసుకురావడానికి సమితి చేస్తున్న కృషి అభినందనీయమని ఆమె అన్నారు. సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాల వల్ల రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యం, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు మద్య నిషేధాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని పిలుపునిచ్చారు. చదువు మధ్యలో ఆపేసిన పిల్లల చదువు బాధ్యతను వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కళాశాల ప్రిన్సిపల్ నారాయణ, లెక్చరర్లు నాగరాజు, దాసు, సమితి సభ్యులు నాగ శంకర్ రెడ్డి, పాపిరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మాచర్లలో గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ




మాచర్ల అక్టోబర్ : 02 ( మహి న్యూస్ ): అహింసా మార్గంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ, 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో దేశానికి స్ఫూర్తినిచ్చిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల పోరాటం, త్యాగం తరతరాలకు ఆదర్శనీయమని పల్నాడు జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మహనీయుల జయంతి సందర్భంగా గురువారం మాచర్ల పట్టణంలోని వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాంధీ చూపిన సత్యం, అహింస మార్గాన్ని, శాస్త్రి నిజాయితీ, నిరాడంబరతను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల్లో తనిఖీలు.. డీలర్లకు కీలక సూచనలు



మాచర్ల, అక్టోబర్ 2 (మహి న్యూస్):: అధికారుల ఆదేశాల మేరకు మాచర్ల పట్టణంలోని షాప్ నెం.18తో పాటు కొత్తపల్లి గ్రామంలోని షాప్ నెం.40, కొప్పునూరు గ్రామంలోని షాప్ నెం.36లను సీఎస్డీటీ ఎస్.కె. భాష తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాల్లో క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన సమస్యలను పరిశీలించి, వాటిని పరిష్కరించారు. అలాగే ప్రతి రైస్ కార్డుకు కార్డుదారుని ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని సంబంధిత డీలర్లకు తగు సూచనలు జారీ చేశారు. రేషన్ పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీలర్లకు సూచించారు.



## గాంధీ, శాస్త్రి జయంతి కార్యక్రమాలు

### చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు

### గ్రంథాలయ చైర్‌పర్సన్ భీమనేని వందనా దేవి




గుంటూరు, అక్టోబర్ 2: (మహి న్యూస్): జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ భీమనేని వందనా దేవి ఆధ్వర్యంలో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వందనా దేవి మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింస సిద్ధాంతాలతో స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని తెలిపారు. లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి రెండో ప్రధానమంత్రిగా సేవలందించి, "జై జవాన్.. జై కిసాన్" నినాదంతో ప్రజల్లో స్ఫూర్తి నింపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కె. ఝాన్సీ లక్ష్మి, సీనియర్ సహాయకులు ఆర్. కుమార్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖైదీలు ఆలోచనలు మార్చుకుని సత్ప్రవర్తనతో మెలగాలి

### ఆత్మపరిశీలనతో ఆలోచనల్లో మార్పు వస్తుంది

### ఆటలు, పాటల పోటీల విజేతలకు బహుమతులు




గుంటూరు, అక్టోబర్ 2: (మహి న్యూస్): ఖైదీలు గతాన్ని పక్కనపెట్టి ఆలోచనలు మార్చుకుని భవిష్యత్తులో తప్పులు పునరావృతం కాకుండా సత్ప్రవర్తనతో జీవించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం, మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతిరోజూ నిద్రించే ముందు ఆత్మపరిశీలన చేసుకోవడం ద్వారా ఆలోచనల్లో మార్పు వస్తుందని తెలిపారు. ఖైదీల కోసం నిర్వహించిన ఆటలు, పాటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్, డీఆర్ఓ ఎన్. షేక్ ఖాజావలి, జిల్లా జైలు సూపరింటెండెంట్, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

## గాంధీ, శాస్త్రి జీవితాలు స్ఫూర్తిదాయకం

### వారి జీవితాల నుంచి ఓర్పు, నిజాయితీ నేర్చుకోవాలి

### కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ



గుంటూరు, అక్టోబర్ 2: (మహి న్యూస్): మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జీవితాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అన్నారు. తెనాలి ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన గాంధీ, శాస్త్రి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ జీవితం నుంచి ఓర్పు, సహనం, పట్టుదల, అహింస, సత్యం వంటి విలువలను నేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. లాల్ బహదూర్ శాస్త్రి జీవితం నుంచి నిరాడంబరత, నిజాయితీ వంటి గుణాలను అలవర్చుకోవాలని తెలిపారు. మహనీయులు చూపిన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెనాలి ఆర్డీఓ కె. శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.



# ఐజేయు, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఘనంగా జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం..

### జర్నలిస్టుల డిమాండ్స్ తో దద్దరిల్లిన మాచర్ల.. నినాదాలతో మార్మోగిన మాచర్ల.. గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేత.. డిమాండ్స్ పత్రాన్ని తహశీల్దార్ కిరణ్ కుమార్ కు అందజేసిన యూనియన్ నాయకులు..



మాచర్ల అక్టోబర్ 02 : ( మహి న్యూస్ ): గాంధీ జయంతిని పురస్కరించుకుని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ పిలుపుమేరకు శుక్రవారం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) మెంబర్ మాగులూరి రాంబాబు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలో జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ రోడ్ లోని మురళి కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి, జిందాబాద్ ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్, జిందాబాద్ ఏపీయుడబ్ల్యూజే,జర్నలిస్టుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి అంటూ పెద్ద ఎత్తున చేసిన నినాదాలతో మాచర్ల పట్టణం దద్దరిల్లింది. యూనియన్ జెండాలను, ప్లకార్డులను చేత పట్టుకుని పట్టణ ప్రధాన రహదారిలో చేసిన ర్యాలితో మాచర్ల మార్మోగింది. కార్యక్రమంలో భాగంగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించి అనంతరం తహశీల్దార్ బందెల కిరణ్ కుమార్ కు డిమాండ్స్ పత్రాన్ని అందజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దార్ కిరణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై పెండింగ్లో ఉన్న డిమాండ్స్ ను పరిష్కరించాలని కోరుతూ ఐజేయు ఇచ్చిన పిలుపుమేరకు అనుబంధమైన ఏపీయూడబ్ల్యూజే కూడా పాల్గొని జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం నిర్వహించుకోవడం జరిగిందన్నారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులు మీడియా సంస్థల రక్షణ కోసం కేంద్రం ప్రత్యేక చట్టం తీసుకురావాలని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిజం నాలుగో స్తంభం అని కీర్తిస్తున్నప్పటికీ పత్రికలు, మీడియా సంస్థల జర్నలిస్టులు భౌతిక దాడులకు అక్రమ నిర్బంధాలకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు ఎంఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల చట్టబద్ధమైన హక్కులను పునరుద్ధరించాలని,వేతన చట్టం అమలు చేయాలని, యాజమాన్యాలు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఐజేయు మెంబర్ మాగులూరి రాంబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ,ఆత్మ రక్షణ కోసం, జర్నలిస్టులపై జరుగుతున్న భౌతిక దాడులు అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టాలను తీసుకురావాలని అన్నారు. ప్రస్తుతం జర్నలిజం, జర్నలిస్టుల పట్ల ప్రభుత్వాల తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యాలు కొనసాగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు నివేశన స్థలాలను మంజూరు చేయాలని,ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవనానికి స్థలం కేటాయించి భవన నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు పఠాన్ జాన్ ఖాన్, పులుసు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు కొత్త మాస శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షులు ఇల్లూరి పుల్లా రెడ్డి,బాహాటం శేషగిరిరాజు, నియోజకవర్గ మాజీ అధ్యక్షులు బాలబోయిన పాపారావు, దాసరి రాధాకృష్ణ, దొంగరి వెంకటేశ్వర్లు, హెచ్ఎంటివి శంకర్,సివిఆర్ భాష,టీవీ5 చెన్నారెడ్డి, ఎంఆర్ఆర్ న్యూస్ మాచర్ల రాజా,పిఎం9 న్యూస్ మాచర్ల రత్నం,ఏపి175 న్యూస్ బంక నాగేశ్వరరావు, పివిఆర్ న్యూస్ పణ్యమూర్తి వెంకటేశ్వర్లు, వంకాయలపాటి రవి,కె.జాని భాష,యేసు బాబు, బూతుకూరి రామచంద్రారెడ్డి, గాజుల ముక్కంటి, తాటి విజయ్ బాబు, పరిమల విజయ్,గట్ల కోటిరెడ్డి,తవిటి శ్రీకాంత్, పోలేపల్లి ఆనంద్, కంభంపాటి ప్రేమ్ కుమార్, కంభంపాటి మోహన్ రావు,బుట్టి అక్కయ్య,బి.హనుమంతరావు,మాచర్ల విద్యాసాగర్, పొన్నల ప్రవీన్,సుంకర జోగయ్య,సంతవరపు లక్ష్మీనారాయణ, కోటయోహాన్, కర్పూరపు శ్రీనివాసరావు, షేక్ జానీ బాషా(దుర్గి), పులిమెల మాణిక్యరావు,నోముల నర్సయ్య,నాగరాజు, నరేష్,ప్రమోద్, హుస్సేన్,శ్రీను,బీర్నీడి దాసు,పాగళ్ళ చంద్రశేఖర్, ఆరుమూళ్ళ జాను,కొంగర వెంకటేశ్వర్లు, రెంటచింతల మండల అధ్యక్షుడు పూజల వెంకటరామయ్య,కుందూరు అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## 4న బుర్రిపాలెంలో సీఎం పర్యటన

### పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

### సభకు 5 వేల మంది వరకు హాజరయ్యే అవకాశం



గుంటూరు, అక్టోబర్ 2: (మహి న్యూస్): తెనాలి మండలం బుర్రిపాలెంలో అక్టోబర్ 4న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. పర్యటన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ కింద మంజూరైన గృహ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం గ్రామ పొలిమేరల్లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభకు సుమారు 5 వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను పక్కాగా ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వెదురు ఉత్పత్తులను ప్రోత్సహించాలి

### ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత ఉత్పత్తులు వినియోగించాలి



### జిల్లా మేదర సంఘం పిలుపు

గుంటూరు, అక్టోబర్ 2: (మహి న్యూస్): పర్యావరణహితమైన వెదురు ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా మహాత్మా గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని జిల్లా మేదర సంఘం పిలుపునిచ్చింది. లాలాపేటలోని సంఘ భవనంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మైలపల్లి శ్రీనివాసరావు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యక్షుడు కొండా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి వెదురు ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నందికట్ల విటల్ బాబు, కొండా శంకర్, నందికంటి శ్రీనివాసరావుతో పాటు జిల్లా, పట్టణ మేదర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

### గుంటూరు జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్వచ్ఛత అవార్డులు

### జిల్లా స్థాయిలో 62 మందికి అవార్డులు

### అవార్డులతో మరింత బాధ్యత పెరుగుతుంది: కలెక్టర్



గుంటూరు, అక్టోబర్ 2: (మహి న్యూస్): మహాత్మా గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛతను ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి సమష్టిగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్వచ్ఛత అవార్డుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గుంటూరు, తెనాలి, మంగళగిరి--తాడేపల్లి, పొన్నూరు పట్టణ స్థానిక సంస్థలకు రాష్ట్రస్థాయి స్వచ్ఛత అవార్డులు లభించాయని తెలిపారు. గుంటూరు నగరానికి స్వచ్ఛ వాయు కార్యక్రమంలో జాతీయ స్థాయిలో రెండో స్థానం లభించిందన్నారు. నంబూరు స్వచ్ఛ గ్రామ పంచాయతీగా, నిడమర్రు స్వచ్ఛ పాఠశాలగా, యూపీహెచ్‌సీ ఇందిరానగర్ స్వచ్ఛ ఆసుపత్రిగా, దుగ్గిరాల కాంటినెంటల్ కాఫీ స్వచ్ఛ పరిశ్రమగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో 62 మందికి స్వచ్ఛత అవార్డులు అందజేశారు. స్వచ్ఛతను ఇల్లు, కార్యాలయం నుంచే ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ మాట్లాడుతూ స్వచ్ఛతను సామాజిక బాధ్యతగా ప్రతి పౌరుడు స్వీకరించాలని కోరారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని, తడి--పొడి చెత్తను వేరు చేసి నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కిషోర్, జడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.





## పరిశుభ్రత మనందరి బాధ్యత

### ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ పల్నాడు సాధ్యం

### స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవార్డుల ప్రదానం -కలెక్టర్ కృతికా శుక్లా




నరసరావుపేట, అక్టోబర్ 2: (మహి న్యూస్): పరిశుభ్రత కేవలం ప్రభుత్వ అధికారుల బాధ్యత కాదని, ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నరసరావుపేటలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 13 శాఖల సమన్వయంతో స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పారిశుధ్య సిబ్బందికి అవసరమైన వాహనాలు, పరికరాలు అందించామని తెలిపారు. చిలకలూరిపేట మున్సిపాలిటీ సాధించిన రాష్ట్రస్థాయి గుర్తింపు స్ఫూర్తిగా జిల్లాలోని అన్ని ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో పల్నాడును స్వచ్ఛమైన, సురక్షితమైన జిల్లాగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించి, అవార్డులను ప్రదానం చేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, అధికారులు పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీపై చర్యలు అవసరమన్నారు. కార్యక్రమానికి ముందు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, డీఆర్ఓ అద్దయ్య, ఆర్డీఓ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, డీపీఓ నాగేశ్వర నాయక్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







## పల్లె పండుగతో గ్రామస్వరాజ్యం సాధ్యం..!

### ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్ల అక్టోబర్ 2 :(మహి న్యూస్): పల్లెపండుగతో గ్రామస్వరాజ్యం సాధ్యపడుతోంది ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ -- గ్రామీణ' పథకం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా మౌళిక వసతుల కల్పన, మిని గోకుల షెడ్లు వంటి నిర్మాణాలకు రూ.10 కోట్ల మంజూరు కాగా.., శుక్రవారం మాచర్ల మండలంలో సుడిగాలి పర్యటన చేసి రూ.2 కోట్ల 10 లక్షలు విలువ చేసే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి, భూమి పూజ చేశారు. ముందుగా తాళ్లపల్లి గ్రామంలో 44 లక్షలతో సీసీ రోడ్లు, మిని గోకుళాలు, కొత్తపల్లి గ్రామంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, కంభంపాడు గ్రామంలో రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, రాయవరం గ్రామంలో 24 లక్షలతో సీసీ రోడ్లు, జమ్మలమడక గ్రామంలో రూ. 40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే జూలకంటి భూమి పూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నడ్డి పెద్దిరాజు, రామిశెట్టి సైదారావు, రోహిత్, గుండెబోయిన శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, మోడయ్య, బెల్లంకొండ కృష్ణ, కూనిశెట్టి రామకృష్ణ, కోటేశ్వరరాజబ మున్నా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఎం ఆర్ ఓ , సర్వేయర్ మధ్య ఘర్షణ




దాచేపల్లి అక్టోబర్ 02 : ( మహి న్యూస్ ): దాచేపల్లి ఎం ఆర్ ఓ కార్యాలయంలో అధికారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఎం ఆర్ ఓ శ్రీనివాస్ యాదవ్, నడికుడి సర్వేయర్ హనుమంతు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. నడికుడి గ్రామానికి చెందిన సంధ్య అనే మహిళకు చెందిన భూమి కొంత భాగం వెబ్ ల్యాండ్ లో నమోదు కాలేదు. దీనిని సరిచేయాలని ఏడాదిగా వి ఆర్ ఓ , సర్వేయర్ చుట్టూ తిరుగుతోంది. పట్టించుకోకపోవడంతో ఎం ఆర్ ఓ శ్రీనివాస్ యాదవ్ ను ఆశ్రయించింది. దీంతో సదరు భూమిని పరిశీలించి నివేదిక ఇవ్వాలని వి ఆర్ ఓ, సర్వేయర్ కు ఎం ఆర్ ఓ ఆదేశించారు. అయినా పరిష్కరించలేదు. వివరణ ఇచ్చేందుకు కార్యాలయానికి రావాలని సర్వేయర్ హనుమంతుకు ఎం ఆర్ ఓ ఆదేశించగా, దరఖాస్తు తన దృష్టికి రాలేదని దురుసుగా సమాధానం ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఎం ఆర్ ఓ మందలించడంతో వాగ్వాదం ముదిరి ఇరువురి మధ్య ఘర్షణకు దారితీసింది. తహసీల్దార్ కార్యాలయంలోనే దాడి చేసుకోవడంతో తోటి ఉద్యోగులు ఖంగుతిన్నారు. ఈ ఘటనపై ఎం ఆర్ ఓ శ్రీనివాస్ యాదవ్ ఉన్నతాధికారులకు నివేదిక పంపి, దాచేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై నివేదిక ఇవ్వాలని గురజాల ఆర్డీవో కి ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ ఘటన జిల్లా రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# గాంధీజీ స్ఫూర్తితో భక్తులకు అంకితభావంతో సేవలందించాలి

### స్వచ్ఛత, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి: టీటీడీ జేఈవో ప్రభల గోపీనాథ్



తిరుపతి,అక్టోబర్ 2,మహి న్యూస్ : జాతిపిత మహాత్మా గాంధీజీ స్ఫూర్తితో టీటీడీ ఉద్యోగులు మరింత నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని టీటీడీ జేఈవో (వైద్యం, విద్య) ప్రభల గోపీనాథ్ కోరారు. స్వచ్ఛత, పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. టీటీడీ పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఈవో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు విశ్వాసంతో శ్రీవారి దర్శనానికి వచ్చే పవిత్రమైన టీటీడీలో పనిచేయడం మన అదృష్టమని, సేవా భాగ్యమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి మానవతా దృక్పథంతో భక్తులకు సేవలందించాలని సూచించారు. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సత్యం, అహింస మార్గాల ద్వారా ప్రజలను ఏకం చేసిన గాంధీజీ, సామాజిక అసమానతల నిర్మూలనకు, అన్ని వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని తెలిపారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో ఆనందరాజు, తిరుపతి ఎస్టేట్ ఆఫీసర్ శ్రీమతి సువర్ణమ్మ, తిరుమల ఎస్టేట్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు, సీఏవో వేంకటరమణ, శ్వేత ఇన్‌చార్జి సంచాలకులు డా. వేమా వెంకట రత్నం, ఇతర అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతిష్టాత్మక 'స్వచ్ఛ ఆంధ్ర అవార్డు 2026'



తిరుపతి,అక్టోబర్ 2, మహి న్యూస్: తిరుపతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రతిష్టాత్మక స్వచ్ఛ ఆంధ్ర అవార్డు 2026ను కైవసం చేసుకుంది. ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, మరియు భక్తులకు కల్పిస్తున్న స్వచ్ఛమైన వాతావరణానికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి ఈ అవార్డును స్వీకరించారు. ఆలయ ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచుతూ, వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేస్తున్న పారిశుధ్య సిబ్బందిని, ఇతర ఉద్యోగులను మరియు సహకరిస్తున్న భక్తులను ఆలయ అధికారులు ఈ సందర్భంగా అభినందించారు. ఆలయ పవిత్రతతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్తులోనూ ఇదే విధమైన సేవలను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్ శ్రీవాణి మాట్లాడుతూ ఈ అవార్డు తనకు దక్కడంలో వెన్నంటి ప్రోత్సహించిన టిటిడి ఉన్నత అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ సైతం పాల్గొన్నారు.

# కార్పొరేట్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్ ( సిఈపి) మరియు ప్రాజెక్ట్ తొలి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా, మహాసముద్రం టోల్ ప్లాజా బృందం...



చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం. మహి న్యూస్ అక్టోబర్ 2. : చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం మహాసముద్రం టోల్ ప్లాజాకు సమీపంలోని గుండ్ల కట్టమంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో చదువుతున్న ప్రతిభావంతులైన బాలికా విద్యార్థులకు 10 సైకిళ్లను పంపిణీ చేసింది. 8, 9, 10వ తరగతులు, అలాగే ౦1 మరియు ౦2 తరగతుల్లో మొదటి మరియు రెండవ స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు వారి విద్యా ప్రతిభను గుర్తించి ఈ సైకిళ్లను అందజేశారు. విద్యార్థినులను చదువులో మరింతగా ప్రోత్సహించడం మరియు వారి విద్యాభ్యాసానికి తోడ్పాటు అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో టీమ్ లీడర్ శ్రీ రామారావు, ప్లాజా మేనేజర్ శ్రీ చైతన్య, శ్రీ కిరణ్, శ్రీ గిరిబాబు, శ్రీ రవికుమార్, శ్రీ జితేంద్రతో పాటు పాఠశాల సిబ్బంది మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం మరియు స్థానిక సమాజ అభివృద్ధికి తోడ్పడే ఇటువంటి కార్యక్రమాలను కొనసాగించేందుకు మహాసముద్రం టోల్ ప్లాజా బృందం కట్టుబడి ఉంది.



# మొగిలీశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ మెంబరకు బలిజ సంఘం నాయకులచే సన్మానం



బంగారుపాలెం. మహి న్యూస్ అక్టోబర్ 2.: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండల పరిధిలోని మొగిలి గ్రామంలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయ డెవలప్మెంట్ కమిటీ నెంబర్ గా రాగిమానుపెంట గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు ఎం. వెంకటేశ్వర్లు భార్య కనకదుర్గమ్మ ను ఎన్నుకున్నందుకు బంగారు పాల్యం మండల బలిజ సంఘం నాయకులు మొగిలి త్రివేణి కుమార్ ముత్యాల మధుబాబు కాజూరు శ్రీనివాసులు,జి లోకానథం లు ఆధ్వర్యంలో బలిజ సంఘం నాయకులు గురువారం కనకదుర్గమ్మ కమిటీ మెంబర్ గా మొగిలిలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గజమాలలు వేసి సాలవతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా త్రివేణి కుమార్ మధుబాబు శ్రీనివాసులు లోకనాథములు మాట్లాడుతూ తమ కులస్తులకు మొగిలీశ్వర స్వామి ఆలయం డెవలప్ మెంట్ కమిటీ మెంబర్ గా ఇచ్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కు కృతజ్ఞతలు తెలిపారు

# సర్పంచులకు సన్మాన కార్యక్రమం....



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మహి న్యూస్ అక్టోబర్ 2.: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలోని సర్పంచులకు పదవీకాలం ముగియడంతో పాలేరు పంచాయతీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీ సర్పంచులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం మండల ఉప సర్పంచ్ ఆర్. కామరాజు, తుంబకుప్పం సర్పంచ్ లీలావత మ్మ కుమారుడు మంజునాథ్ లకు పూతలపట్టు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో వారికి శాలువాలు కప్పి వైఎస్ఆర్సిపి ఐడి కార్డులు అందజేసి ఘనంగా సన్మానించారు. ఐదు సంవత్సరాలపాటు వారి చేసిన సేవలను గుర్తు చేస్తూ పార్టీని మరింత పటిష్టంగా ముందుకు తీసుకుపోవాలని డాక్టర్ సునీల్ కుమార్ వారి సన్మాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లలిత థామస్, ఎంపీపీ అమరావతి వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, మండల కో -ఆప్షన్ నెంబర్ అన్ను, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు సర్దార్, రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నాలుగు మాడ వీధుల రూపకర్త శ్రీ రామానుజాచార్యులు

## తిరుమల ఆలయ కైంకర్య వ్యవస్థకు పునాది తో మహోన్నత సేవ నేటికీ కొనసాగుతున్న వెయ్యేళ్ల సంప్రదాయాలు

తిరుమల ,అక్టోబర్ 2, మహి న్యూస్ : తిరుమల శ్రీవారి ఆలయం చుట్టూ నాలుగు మాడ వీధుల ఏర్పాటు చేసి, శ్రీవారి బ్రహ్మోత్సవాలను తిరుమలలోనే వైభవంగా నిర్వహించే విధానానికి బాటలు వేసిన మహనీయుల్లో భగవద్ రామానుజాచార్యులు ప్రముఖులు. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం ఆయన క్రమబద్ధీకరించిన అనేక కైంకర్యాలు, ఆగమ సంప్రదాయాలు, ఉత్సవ విధానాలు నేటికీ తిరుమల శ్రీవారి ఆలయ వ్యవస్థలో కొనసాగుతున్నాయి.



### బ్రహ్మోత్సవాలకు నాలుగు మాడ వీధులు

తిరుమల ఆలయం చుట్టూ నాలుగు మాడ వీధుల ఏర్పాటులో రామానుజాచార్యుల పాత్ర విశిష్టమైనదిగా ఆలయ చరిత్ర తెలియజేస్తోంది. గతంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఎనిమిది రోజులపాటు తిరుచానూరులో నిర్వహించేవారని సంప్రదాయ కథనాలు చెబుతున్నాయి. నాలుగు మాడ వీధుల ఏర్పాటు అనంతరం బ్రహ్మోత్సవాలను తిరుమలలోనే నిర్వహించే విధానం ఏర్పడింది. శ్రీవారి ఉత్సవమూర్తి మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తూ ఊరేగే సంప్రదాయం క్రమంగా తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా మారింది. నేడు వాహన సేవలు, ఊరేగింపులు, భక్తుల దర్శనం వంటి అనేక కార్యక్రమాలకు ఈ నాలుగు మాడ వీధులే ప్రధాన వేదికగా నిలుస్తున్నాయి.

### మాడ వీధులకు ఆధ్యాత్మిక నామాలు

ఇటీవలే తిరుమలలో వీధులు, కూడళ్లకు శ్రీవారి సేవలో తరించిన దేవతలు, దైవాంశ సంభూతులు, పురాణ పురుషులు, రాజులు, పండితుల పేర్లను పెట్టాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగా భగవద్ శ్రీ రామానుజాచార్యుల వారి సేవలకు గుర్తుగా శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న ప్రాంగణానికి శ్రీ రామానుజాచార్యుల ప్రాంగణంగా నామకరణం చేయడం జరిగింది. అదేవిధంగా ఆలయ నాలుగు మాడ వీధులలో తూర్పు మాడ వీధినకి ఋగ్వేద మార్గం, దక్షిణ మాడ వీధికి యజుర్వేద మార్గం, పడమర మాడ వీధికి సామవేద మార్గం, ఉత్తర మాడ వీధికి అథర్వణ వేద మార్గంగా నామకరణం చేయడం జరిగింది.

### జీయర్ వ్యవస్థ ఏర్పాటు

వైఖానస ఆగమ శాస్త్ర సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయంలో నిర్వహించాల్సిన కైంకర్యాలు, ఆచార వ్యవహారాలను



పర్యవేక్షించే బాధ్యతను జీయర్లకు అప్పగించడం ద్వారా రామానుజాచార్యులు కీలకమైన వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఆయన ఆధ్వర్యంలో వెంకటనాథ శఠగోప యతి లేదా జీయర్ మఠం తిరుమలలో ఏర్పాటైంది.

### ఆలయ కైంకర్యాలు, ఆచారాలకు రూపకల్పన

ఆళ్వార్ల దివ్యప్రబంధంలోని శ్రీవేంకటేశ్వరస్వామికి సంబంధించిన 250కు పైగా పాశురాల పారాయణాన్ని ఆలయంలో ప్రవేశపెట్టారు. ఇందుకోసం ఆచార్య పురుషులను నియమించారు.



అలాగే ఇతర మఠాలకు చెందిన పీఠాధిపతులు, జీయర్లు లేదా సన్యాసులు తిరుమల ఆలయానికి విచ్చేసినప్పుడు పూర్ణకుంభ స్వాగతం పలికి, తీర్థం, ప్రసాదం, శేషవస్త్రం సమర్పించే సంప్రదాయాన్ని రామానుజాచార్యులే ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది. గోదా కల్యాణం, తన్నీరముదు ఉత్సవం, భగ్ సవారి ఉత్సవం వంటి పలు ఉత్సవాలను కూడా ఆయన ప్రవేశపెట్టినట్లు ఆలయ చరిత్ర తెలియజేస్తోంది.

### స్వామివారికి అన్నప్రసాదాల నైవేద్యం

తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాలు అందించే విధానానికి కూడా రామానుజాచార్యులు ప్రాధాన్యత ఇచ్చారు. స్వామివారికి సమర్పించే నైవేద్యాలను ఆలయ వంటశాలలోనే సిద్ధం చేయాలని, వాటిని శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించే వంటవారితో తయారు చేయించాలని నిర్దేశించారు. గుడాన్నం, చిత్రాన్నం, పాయసం, అతిరసం, అప్పం, దోశ తదితర నైవేద్యాలను స్వామివారికి సమర్పించే సంప్రదాయాన్ని ఆయన ప్రోత్సహించారు.

### వివిధ దేవతామూర్తుల ప్రతిష్ఠ

తిరుమల ఆలయంలో వివిధ దేవతామూర్తుల ప్రతిష్ఠలోనూ రామానుజాచార్యుల సేవలు విశిష్టమైనవి. సీతాదేవి, భూదేవి, శ్రీయోగ నరసింహస్వామి విగ్రహాలను రామానుజాచార్యులవారు స్వయంగా పంచలోహంతో రూపొందించి ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. తిరుమల ఆలయంలో ఇతర దేవతామూర్తుల అర్చామూర్తులు ఉన్నప్పటికీ సీతాదేవి అర్చామూర్తి లేకపోవడంతో రామానుజాచార్యులు సీతాదేవి పంచలోహ విగ్రహాన్ని రూపొందించి ప్రతిష్ఠించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని కూడా నిర్వహించారు.

### యోగ నరసింహస్వామి ఆలయ ఏర్పాటు

శ్రీవైష్ణవ సంప్రదాయంలో వరాహ, నరసింహ, రామ, కృష్ణ అవతారాలకు ప్రత్యేక స్థానం ఉంది. రామానుజాచార్యుల కాలంలో తిరుమలలో నరసింహస్వామికి ప్రత్యేక ఆలయం లేకపోవడంతో, స్వామి పుష్కరిణి సమీపంలో ఉన్న సుమారు మూడు అడుగుల ఎత్తైన నరసింహస్వామి విగ్రహాన్ని గుర్తించి, ఆయన కోసం మండపాన్ని నిర్మించినట్లు చెబుతారు. ప్రస్తుతం యోగ నరసింహస్వామి సన్నిధి తిరుమల ఆలయంలోని ప్రముఖ ఉపాలయాల్లో ఒకటిగా ఉంది.

### భూదేవి పూలబావి అర్చామూర్తి

వరాహ పురాణంలోని ఒక ఘట్టాన్ని స్మరించుకుంటూ, రామానుజాచార్యులు భూదేవి అర్చామూర్తిని పూలబావిలో ప్రతిష్ఠించినట్లు ఆలయ సంప్రదాయం తెలియజేస్తోంది. శ్రీ వేంకటేశ్వరస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఏకాంతంలో ఉన్న సమయంలో తొండమాన్ చక్రవర్తి అనుకోకుండా వారి ఏకాంత



ప్రదేశంలోకి ప్రవేశించిన సందర్భానికి సంబంధించిన కథనం ఆధారంగా ఈ అర్చామూర్తిని ఏర్పాటు చేసినట్లు చెబుతారు.

### శ్రీ రామానుజాచార్యుల అపార భక్తికి ప్రతీక

కాలానుగుణంగా ఆలయ నిర్వహణలో అనేక మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, రామానుజాచార్యులు నిర్దేశించిన ప్రధాన ఆగమ సంప్రదాయాలు, కైంకర్యాలు, సేవలు, నియమ నిబంధనలు నేటికీ తిరుమల, తిరుపతి, తిరుచానూరు ఆలయాల్లో కొనసాగుతున్నాయి. శ్రీవారి ఆలయ వ్యవస్థను క్రమబద్ధీకరించి, కైంకర్యాలకు పటిష్టమైన పునాది వేసిన రామానుజాచార్యుల సేవలు, శ్రీ వేంకటేశ్వరస్వామివారిపై ఆయనకు ఉన్న అపారమైన, అవిచ్ఛిన్నమైన భక్తికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# పాలేరులో జరిగిన వైఎస్ఆర్సిపి పార్టీ ఆత్మీయ సమావేశం.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుభి మోగిద్దాం. పూతలపట్టు నియోజవర్గం సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్.




చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం. మహి న్యూస్ అక్టోబర్ 2.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం పాలేరు పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన వైయస్ఆర్సీపీ పార్టీ ఆత్మీయ సమావేశానికి మండల కన్వీనర్ పాలేరు రామచంద్ర రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూతలపట్టు నియోజవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడ రాజీ పోకుండా ధైర్యంగా ఎదురు పార్టీని



ఎదుర్కొని మండలంలోని 41 పంచాయతీలో దాదాపు 35 పంచాయతీలు సర్పంచ్ ఎన్నికలలో విజయం సాధించాలని, మండలంలో ఉన్న 21 పంచాయతీలలో దాదాపు 15 పంచాయతీలలో ఎంపీటీసీ స్థానాలు సాధించాలని దీనికోసం వైఎస్సార్ సీపీ పార్టీ తరపున నాయకుల అండదండలు మీకు ఎల్లవేళలా ఉంటాయని డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా మాజీ పరిషత్ చైర్మన్ ఎంబి కుమార్ రాజా మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఐడి కార్డు ఇవ్వబడుతుందని, ఇప్పటివరకు దాదాపు 80% కార్డులు మండలానికి రావడం జరిగిందని, మిగతా రాణి వారికి కూడా కార్డులు మంజూరు చేయబడతాయని, దీని ద్వారా కార్యకర్తకు ప్రమాదవశాత్తు ఏమైనా జరిగిన 40 రోజులలో ఆ కార్యకర్తకు ఐదు లక్షల రూపాయలు పార్టీ ద్వారా ఇవ్వబడుతుందని ఐడి కార్డు తప్పనిసరిగా మీ దగ్గర పెట్టుకోవాలని తెలిపారు. ఇప్పటికి సుమారు రెండు నెలల లోపు స్థానిక సంస్థలు ఎన్నికలు రానున్న దృశ్య పోటీ చేసే ప్రతి వ్యక్తి ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు తాసిల్దార్ కార్యాలయంలో పొందాలని తెలిపారు. మండల కన్వీనర్ పాలేరు రామచంద్ర రెడ్డి, మండల వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి మాట్లాడుతూ, మండలంలో వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తకు పోలీసు ద్వారా గుండా కానీ వేరే ఇతర అధికారుల వల్ల కానీ ఇబ్బంది జరిగిన తమకు వెంటనే తెలియజేస్తే వైఎస్ఆర్సిపి పార్టీ మీకు ఎప్పటికీ అండగా ఉంటుందని తెలిపారు. తదుపరి ఎంపిటిసిలు సర్పంచులకు పదవి ముగియడంతో వారికి శాలువాలు కప్పి సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి మండలంలోని కార్యకర్తలకు డాక్టర్ సునీల్ కుమార్ ద్వారా ఐడి కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లలిత థామస్, ఎంపీపీ అమరావతి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, గోవిందస్వామి, అమర్నాథ్, మొగిలీశ్వర్, కిషోర్ కుమార్ రెడ్డి, డాబా దొరస్వామి, కరుణాకర్, చంద్రారెడ్డి, ఆనంద్ రెడ్డి, మొగిలి రెడ్డి, నాగరాజు, మహేంద్ర, గజేంద్ర, జగదీష్, వాణి ప్రియ, భారతమ్మ, తదితర మండల వైఎస్సార్సీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రైతు ఇంట సిరులు పండాలి.. రాయలసీమ సస్యశ్యామలం కావాలి

### శ్రీవారి సుప్రభాత సేవలో కుటుంబ సమేతంగా పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు
### పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థన
### హార్టికల్చర్ హబ్ విజయవంతం కావాలని ఆకాంక్ష



తిరుమల, అక్టోబర్ 2: (మహి న్యూస్): రైతులకు ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తగ్గి, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి రైతు కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కుటుంబ సమేతంగా శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించాలని కోరుకున్నట్లు తెలిపారు. రాయలసీమ అభివృద్ధి లక్ష్యంగా చేపడుతున్న హార్టికల్చర్ హబ్ కార్యక్రమం విజయవంతం కావాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు. హార్టికల్చర్ హబ్‌తో రాయలసీమలో ఉద్యానరంగం అభివృద్ధి చెంది రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు లభించాలని, సీమ సస్యశ్యామలంగా మారాలని ఆకాంక్షించారు.



# కల్కి భగవాన్ అంతిమయాత్రలో మంత్రి ఆనం

### రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా అంతిమ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి
### ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
### కల్కి భగవాన్‌కు నివాళులర్పించిన ఆనం రామనారాయణ రెడ్డి





తిరుపతి, అక్టోబర్ 2: (మహి న్యూస్): ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, వన్‌నెస్ స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు కల్కి భగవాన్ (విజయ్ కుమార్ నాయుడు) అంతిమయాత్రలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు. సెప్టెంబర్ 29న చెన్నైలో కల్కి భగవాన్ పరమపదించడంతో, రాష్ట్ర ప్రభుత్వం పోలీసు గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం గ్రామంలోని ఏకం క్షేత్రంలో అంతిమ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆధ్యాత్మిక రంగంలో కల్కి భగవాన్ అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు.

# డబ్బుల పంపిణీ ఆరోపణలపై రెండు పాఠశాలల్లో ఎస్.ఎం.సి. ఎన్నికలు రద్దు...!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మహి న్యూస్ అక్టోబర్ 02 : కలసపాడు మండలంలోని తెల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొండపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్.ఎం.సి.) ఎన్నికలను వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. శ్రీధర్ చెరుకూరి రద్దు చేశారు. ఎస్.ఎం.సి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి డబ్బుల పంపిణీ జరిగినట్లు వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని ఈ రెండు పాఠశాలల్లో జరగాల్సిన ఎన్నికలను రద్దు చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. ఎస్.ఎం.సి. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ఎటువంటి ప్రలోభాలకు తావులేకుండా నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో డబ్బుల పంపిణీ, ప్రలోభాలు లేదా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగినట్లు గుర్తించినా, లేదా ఫిర్యాదు అందినా, విచారణ చేపట్టి సంబంధిత ఎన్నికలను రద్దు చేసి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్.ఎం.సి. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఎన్నికల నిర్వహణ అధికారులు, తల్లిదండ్రులు, అభ్యర్థులు సహకరించాలని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కోరారు.

## కడప ఆర్డీవో కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు..!





కడప, మహి న్యూస్ అక్టోబరు 2: శుక్రవారం కడప ఆర్డీవో కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో మురళీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆర్డీవో మురళీ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు సీఎం పర్యటనపై బహిరంగ సభ ఏర్పాట్ల సమీక్ష



కడప జిల్లా/ప్రొద్దుటూరు, అక్టోబర్ 2 (మహి న్యూస్): ఈ నెల 5న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రొద్దుటూరు నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో బహిరంగ సభ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, యువ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌తో కలిసి కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఏర్పాట్లను సమీక్షించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు టీడీపీ కట్టుబాటు




కడప జిల్లా/జమ్మలమడుగు, అక్టోబర్ 2 (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవోలు జారీ చేసిందన్నారు. అయితే వైసీపీ నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించి రిజర్వేషన్ల అమలుకు అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకపోవడంతో సుమారు 16,800 మంది రాజకీయ పదవులు కోల్పోయారని తెలిపారు. బీసీలకు న్యాయం జరిగేలా అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడం తెలుగుదేశం పార్టీ విధానంలో భాగమని, గతంలోనే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత తమ పార్టీకి ఉందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జమ్మలమడుగు మండల కన్వీనర్ రామయ్య, చలపతి, పాండులు, తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగం జిల్లా నాయకులు సిద్ధు, రామంజిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్తి హోమ్‌లో ఉచిత వైద్య శిబిరం




కడప, మహి న్యూస్, అక్టోబర్ 2: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళలు, బాలికల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఆర్తి సంస్థ ఆధ్వర్యంలో ఆర్తి హోమ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్తి ఇన్‌స్టిట్యూట్ ట్రస్టు అధ్యక్షురాలు పి.వి. సంధ్య మాట్లాడుతూ ఆరోగ్యకరమైన శరీరంతో పాటు ఆరోగ్యకరమైన మనసు కూడా ముఖ్యమని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు, పిల్లలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే శిబిరం ప్రధాన ఉద్దేశమన్నారు. కడప, హైదరాబాద్‌కు చెందిన వైద్యులు చర్మ, స్త్రీరోగ, గుండె, కంటి, ఎముకలు, సాధారణ వైద్యం, చిన్నపిల్లల వైద్య విభాగాల్లో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు, తదుపరి చికిత్స కోసం సూచనలు అందించారు. ఆర్తి సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు చెందిన 600 మంది పిల్లలు, వారి తల్లిదండ్రులు శిబిరంలో వైద్య సేవలు పొందారు. వ్యక్తిగత పరిశుభ్రత, ముందస్తు ఆరోగ్య సంరక్షణ, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు అవగాహన కల్పించారు. శిబిరం నిర్వహణలో ఆర్తి ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది, ఆర్తి హోమ్ విద్యార్థులు సహకరించారు. వైద్యులకు సంస్థ కార్యదర్శి దుర్గాకుమారి వందన సమర్పించి కృతజ్ఞతలు తెలిపారు.



# సీఈసీ వెంటనే రాజీనామా చేయాలి

### ఎస్ఐఆర్ తో ఓటు హక్కుకు ముప్పు
### పాత ఓటర్ల జాబితానే కొనసాగించాలి
### సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు

రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్02 : ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) పేరుతో కోట్లాది మంది ఓటర్లను ఓటు హక్కుకు దూరం చేసే చర్యలు ప్రజాస్వామ్యానికే తీవ్ర విఘాతం కలిగిస్తాయని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎ. రామాంజులు విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ తక్షణమే రద్దు చేసి పాత ఓటర్ల జాబితానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక సైదియ థియేటర్ సమీపంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ. రామాంజులు, సిపిఎం జిల్లా నాయకులు యం. సుధీర్ కుమార్, డీసీ వెంకటయ్య, సహారా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర నాయకులు ఆఫ్తాబ్, బీసీ సంఘం జిల్లా కన్వీనర్ రేపన రామచంద్ర, సిపిఎం శాఖ కార్యదర్శి జి.మాధవయ్య మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు బదులుగా రహస్య విధానాలు అనుమతించలేమని అన్నారు. 'ఒక్క వ్యక్తి, ఒక్క ఓటు, ఒక్క విలువ' అనే ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రం దెబ్బతినకూడదని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఎన్నికల వ్యవస్థను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయనే వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.




**'నోట్ల రద్దు' తర్వాత 'ఓట్ల రద్దా ?**
**మోదీ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలపై**

కుట్రపూరితంగా దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. పదేళ్ల క్రితం నోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశారని, ఇప్పుడు 'ఓట్ల రద్దు'తో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ తో కేంద్ర ప్రభుత్వ చర్యలు ఎదుర్కొనేందుకు రాజకీయ పార్టీలతో పాటు ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్న పౌరసమాజ, మానవ హక్కుల కార్యకర్తలు, మేధావులు ముందుకు రావాలని కోరారు. ఓటు హక్కు పరిరక్షణకు ప్రజా ఉద్యమం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం కార్యకర్తలు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## కడప కలెక్టరేట్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



కడప, మహి న్యూస్, అక్టోబర్ 2: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కడప కలెక్టరేట్‌లో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో శాంతి, సామరస్యం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వేంకటపతి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు చింతామణి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి చాంద్ బాషా, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాత్కాలిక జి.ఒలు కాదు శాశ్వత పరిష్కారం కావాలి

### కె.జీవానందం, బి.సి జె.ఎ.సి



గాలివీడు:అక్టోబర్02 (మహి న్యూస్ ): బీసీలకు 34% రిజర్వేషన్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్లు 105, 1065 లను గౌరవ హైకోర్టు కొట్టివేయడం బాధాకరమని బి.సి జె.ఎసి నాయకుడు కె.జీవానందం అన్నారు. ఈ తీర్పు ప్రభుత్వానికి ఒక గుణపాఠం, బీసీ సమాజానికి ఒక మేల్కొలుపు.

**మా సున్నితమైన ప్రశ్నలు:**

రాజ్యాంగంలోని 50% సీలింగ్, సుప్రీంకోర్టు తీర్పులు, ట్రిపుల్ టెస్ట్ విధానం ప్రభుత్వానికి తెలియనివి కావు. తెలిసి కూడా న్యాయపరంగా నిలబడని జీవోలు ఇవ్వడం వల్ల బీసీలకు ఒరిగేదేముంది? బీసీలకు నిజంగా న్యాయం చేయాలనుకుంటే, కులగణన చేసి, బీసీ డెడికేటెడ్ కమిషన్ వేసి, శాస్త్రీయ నివేదికతో చట్టం చేయాలి. అది వదిలేసి, ఎన్నికల ముందు హడావుడిగా జీవోలు ఇవ్వడం, అవి కోర్టులో కొట్టుకుపోవడం - ఇది బీసీలను నమ్మించే ప్రయత్నంలా కనిపించడం లేదా? కోర్టు కొట్టేసిన తర్వాత నష్టపోయేది ప్రభుత్వం కాదు, నమ్ముకున్న బీసీ బిడ్డే. అతని చదువు, ఉద్యోగం, రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది. ప్రభుత్వం డ్రామాలు వద్దు, న్యాయబద్ధమైన మార్గంలో ఆలోచించాలి. తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్ లోకి తెచ్చే ప్రయత్నం చేయాలి. లేదా చట్టపరంగా పటిష్టమైన చట్టాన్ని అసెంబ్లీలో చేసి, కేంద్రానికి పంపాలి.

## పాత-కొత్తల కలయికతో పార్టీ బలోపేతం

### స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి: భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/జమ్మలమడుగు, అక్టోబరు 2, (మహి న్యూస్): జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజా దర్బార్, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రజలు, కార్యకర్తలు అందించిన వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పాత, కొత్త నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని భూపేష్ సుబ్బరామిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖైదీలకు గాంధీజీ ఆశయాలపై న్యాయ అవగాహన

### తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని మంచి మార్గంలో నడవాలి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి



కడప, అక్టోబరు 2, (మహి న్యూస్):: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కడప కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారంలో ఖైదీలకు గాంధీజీ ఆశయాలు, న్యాయ హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సంస్థ చైర్మన్ జి. రామ గోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జి. రామ గోపాల్ మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి, ప్రేమ, క్షమాగుణం వంటి గాంధీజీ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. గత తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని పశ్చాత్తాపంతో మంచి మార్గంలో పయనించాలని ఖైదీలకు సూచించారు. జైలు జీవితాన్ని మార్పుకు అవకాశంగా తీసుకుని సత్ప్రవర్తనతో నూతన జీవితాన్ని ప్రారంభించాలని ఆకాంక్షించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి కేసులు, ఆరోగ్య పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయ సహాయం కోసం లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ 15100ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కారాగారాల సూపరింటెండెంట్లు, న్యాయస్థాన సిబ్బంది, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు, ప్యానెల్ న్యాయవాదులు, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు, ఖైదీలు పాల్గొన్నారు.

## చొల్లంగిలో వన్యప్రాణి వారోత్సవాలు ప్రారంభం

### విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సు




తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 2: కాకినాడ జిల్లా చొల్లంగి సీబీఈటీ కేంద్రంలో వన్యప్రాణి వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ వారోత్సవాలను ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్. వరప్రసాద్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా గొల్లప్రోలు విజ్ఞాన వికాస్ పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ, వాటి ఆవశ్యకత, పర్యావరణ సమతుల్యతలో వన్యప్రాణుల పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు.



వన్యప్రాణులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతిలో జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వరప్రసాద్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు కె. సిద్ధార్థ, ఎస్. వీరభద్రరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు గోపీనాగేంద్ర కుమార్, మహేష్, ధనలక్ష్మి, సంధ్యారాణి, పాఠశాల ఉపాధ్యాయులు, సీబీఈటీ సిబ్బంది పాల్గొన్నారు.

## లక్షల కోట్ల పెట్టుబడులతో రాయలసీమ అభివృద్ధికి బాటలు



మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 02: గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి పాలనలో ఎంతో తేడా ఉందని, గత పాలకులు రాయలసీమ రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయలసీమ ప్రాంత ప్రజల కష్టాలను తీర్చడంతో పాటు వ్యవసాయ, ఉద్యాన రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేయడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడనుందని పేర్కొన్నారు. గతంలో కుప్పం నియోజకవర్గంలో ఇజ్రాయెల్ సాంకేతికతను ప్రవేశపెట్టి బిందు, తుంపర్ల సేద్య పరికరాలను రైతులకు రాయితీపై అందించడం ద్వారా ఆధునిక వ్యవసాయ విధానాలను ప్రోత్సహించారని తెలిపారు. ఈ విధానాల ద్వారా తక్కువ నీటితో అధిక ఉత్పాదకత సాధించడంతో పాటు ఉద్యాన పంటల అభివృద్ధికి తోడ్పాటు అందిందన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి సాగునీటి సదుపాయాలను మెరుగుపరిచే దిశగా హంద్రీ--నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను కుప్పం వరకు తీసుకురావడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని తెలిపారు. అలాగే అమృత్ పథకం కింద చెరువులను నింపి పట్టణ ప్రాంతాలకు కూడా నీటి వసతి కల్పించే చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, మౌలిక వసతుల ప్రాజెక్టుల వల్ల రైతులు, యువత, చిన్నతరహా వ్యాపారాలు నిర్వహించే వారికి మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలు చేస్తున్న వివిధ ప్రాజెక్టులు రానున్న సంవత్సరాల్లో ప్రాంతీయ అభివృద్ధికి మరింత దోహదపడతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సాగునీరు, వ్యవసాయం, మౌలిక వసతులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి నీటి వనరులు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రైతులకు వ్యవసాయ రంగంలో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజల ఆత్మగౌరవం, రైతుల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. చిత్తూరు ఎంపి దగ్గుమల్ల ప్రసాద్ రావు, ఎం ఎల్ సి లు కంచర్ల శ్రీకాంత్, రాంభూపాల్ రెడ్డి, పీలేరు, పలమనేరు ఎం ఎల్ ఏ లు నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, ఎన్. అమరనాథ రెడ్డి లతో పాటు పలువురు నాయకులు ప్రసంగించారు. వీరితో పాటు జల వనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శాశిభూషణ్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పియూష్ కుమార్, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్ పి ధీరజ్ కునుబిల్లి, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, తిరుపతి, చిత్తూరు, చంద్రగిరి ఆరణి శ్రీనివాసులు, గురజాల జగన్మోహన్, పులివర్తి నాని, తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com